# చైతన్యం

సంకల్ప బలం

ఫిబ్రవరి 2018

రూ. 20

సామాజిక విలువల మాసపత్రిక

## 69 వ గణతంత్ర దిన సందర్భంగా



విశిష్ట అతిథులుగా విచ్చేసిన 'ఆషియాన్' దేశాధినేతలు




नेशनल
LIVE




వ్యవస్థాపక సంపాదకురాలు:

**తీగవరపు శాంతి**


# చైతన్యం

సంకల్ప బలం


సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -7 ఫిబ్రవరి 2018 సంచిక -5


## ఈ సంచికలో

### ధారావాహికములు:


| | |
|---|---|
| బొమ్మలు చెప్పిన బాలల | 10 |
| మోచేతి పొడుపు | 16 |
| రసాయన శాస్త్రం | 18 |
| మిస్ మేఘమాల | 21 |
| కాశీ ఖండం | 24 |
| సంభాషణ సంస్కృతం | 31 |
| మా ఊరి నందుల కథ | 36 |
| రాశి ఫలాలు | 48 |


### ప్రత్యేక ఆకర్షణలు


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| పాఠకుల స్పందన | 5 |
| ఆకర్షణ | 6 |
| పెరుగు - సంపూర్ణాహారం | 8 |
| శివ సాయుజ్యం పొందిన శ్రీ వి వి ఎస్ శర్మ | 12 |
| సమ్మక్క సారలక్క జాతర | 23 |
| భావకవిత్వ సార్వభౌమ శ్రీ దేవులపల్లి | 27 |
| అవగాహన | 34 |
| డాలస్ లో మహాత్మాగాంధీకి ఘన నివాళి | 35 |
| ఆచార్య దేవో భవ | 38 |
| ప్రహేళిక | 43 |
| శంభో మహాదేవ శరణం | 44 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# వైద్యో నారాయణో... హరీ!

'వైద్యో నారాయణో హరి:' ఇది ఒకప్పటి మాట. మరిప్పుడో? వైద్యో నారాయణో హరీ! ప్రస్తుతం ఇటువంటి-వన్నీ తల్చుకుని మురిసిపోవడానికే. 'వైద్యం' అంటేనే ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా డాక్టరు దగ్గరకి వెడితే, ఆరోగ్యం చేకూరి హాయిగా ఉంటాము అనే ధీమా ఉండేది పూర్వం. కానీ ఇప్పటి పరి-స్థితి వేరు. డాక్టరు దగ్గరకు వెళ్లిన దగ్గరనుండీ అవసరం ఉన్నా లేక పోయినా ఏం టెస్టులు అంటారో అనీ, ఏ రోగం పేరు చెపుతారో అని భయంగా ఉంటున్నారు. పోనీ వెళ్లడం మానెయ్యడం ఎలాగా? ఆరోగ్యం కాపాడుకోవాలనే ఆశ, రోగాన్ని భరించలేని పరిస్థితీ . దీన్ని ఆసరా చేసుకుని కొందరు డాక్టర్లు ప్రజలను రకరకాల ఇబ్బందులకు గురి చేస్తు-న్నారు. అవసరం ఉన్నా లేకపోయినా టెస్టులు చేయించి, వారి ఆర్థిక పరిస్థితిని దిగజారుస్తున్నారు. మరికొందరు డా-క్టర్లు మందుల షాపులతో, డయాగ్నస్టిక్ సెంటర్లతో, ఫార్మసీలతో కుమ్మక్కై, అవసరం లేక పోయినా మందులు వారి చేత కొనిపిస్తున్నారు.ఆ మందులు కూడా కల్తీ మందులే. ఆ మందులు కూడా స్వయంగా తమ ఫార్మసీలలో 'ఎక్స్పైర్ ' అయిన మందులు నింపి పేషంట్లకు ఆరోగ్యాన్ని బదులు అనారోగ్యాన్ని అందిచ్చే డాక్టర్లు మరికొందరు. కొన్ని ఆసు-పత్రు ల వారైతే ఆ పేషంటుకి తమ ఆసుపత్రిలో తగిన వైద్యం ఇవ్వలేము అని తెలిసినా, డబ్బుల కోసం చేర్చుకుని రక రకాల టెస్టులు చేయించి , ప్రాణం పోతోంది అనగా వేరే ఆసుపత్రికి షిఫ్ట్ చేయించి చేతులు దులుపుకునే వారు కూడా తక్కువమంది లేరు. ఇంకా కొందరు డాక్టర్లైతే ఏకంగా ఆపరేషన్ చెయ్యాలని చెప్పి చెయ్యకుండానే పేషంట్ల దగ్గర లక్షల్లో డబ్బులు గుంజి ప్రజలను అయోమయం చేసేస్తున్నారు. ఇంకా ముందుకు వెడితే శరీరంలోని అవ-యవాలు మాయ చేసి అమ్మేసుకుని , తరువాత కూడా వైద్యం చేసాం అంటూ డబ్బులు వసూలు చెయ్యడం. ఇక పేద వాని పరిస్థితి అయితే చెప్పనక్కరనే లేదు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆసుపత్రులు ఎంత వరకు నిజాయితీగా పని చేస్తున్నాయి? ఎంత పరిశుభ్రంగా ఉంటున్నాయి? అక్కడ పని చేసే డాక్టర్లు వారి బాధ్యతను ఎంతవరకూ నిస్వార్ధంగా నిర్వహిస్తున్నారు? అక్కడ అన్ని రకాల వైద్యాలకు సంబంధించిన డాక్టర్లు ఉంటున్నారా? ఏదైనా ఆపరేషన్ చెయ్యా-లంటే అవసరమైన పరికరాలు ఉంటున్నాయా? కార్పొరేట్ ఆసుపత్రిలో లభించే సౌకర్యాలు ప్రభుత్వాలు ఎందుకు కల్పించలేకపోతున్నాయి? ప్రజల ఆరోగ్యాన్ని కాపాడలేని ప్రభుత్వం ఎదో చేసేశాం అని చెప్పుకుంటే సరిపోతుందా?

మనం ఒక మనిషి ప్రాణానికి ఇచ్చే విలువ ఇంతేనా? అన్ని విషయాలలోనూ అమెరికాతో పోల్చుకుం-టామే! ధనవంతులైతే అమెరికా వెళ్లి వైద్యం చేయించుకుంటారు. రాజకీయవేత్తలతో సహా అమెరికా వైద్యం కోసం వెడుతున్నారే ! వారు ఖర్చు చేసే దగ్గర డబ్బులు వారివో, ప్రజలవో ఖర్చుపెట్టుకుని వారి ప్రాణాలు కాపాడుకుంటు-న్నారు. మరి ప్రతీ మనిషి ప్రాణం విలువా అంత కాదా? పేదవాడెవరైనా ఆసుపత్రిపాలైతే, వారి దగ్గరున్న డబ్బులు-ఊడ్చడమే కాక, ఎన్నో అప్పులు చేసి ఆ డబ్బు డాక్టర్ల చేతుల్లోనూ, నర్సులకూ పోసి చివరకు ప్రాణాలు కాపాడుకోలేక, జీవితాంతం అప్పులు తీర్చుకుంటూ బ్రతికేవారు మనకి ఎక్కువగా కనిపిస్తుంటారు. ఆ కుటుంబం అంతా రోడ్డు మీద పడుతుంది. మన దేశంలో ఎక్కువగా ఈ పరిస్థితే చూస్తూ ఉంటాము. మన భారత దేశం సంస్కృతీ , సాంప్రదా-యాలకు నిలయం అనీ, ఆధ్యాత్మిక దేశం అనీ గుళ్లు, గోపురాలు, భక్తికీ మన దేశం ఆదర్శం అనీ, పాప భీతి మనలో ఎక్కువ అనీ గొప్పగా చెప్పుకునే మన దేశంలో ఎంతో ముఖ్యమైన ప్రాణానికి మనం ఇచ్చే విలువ గురించి ఆలోచిం-చవలసిన అవసరం లేదా ? ప్రాణం అందరిదీ ఒకటి కాదా? ఎందుకు ఈ తారతమ్యం?

అమెరికా అంటారే! మాట్లాడితే. అక్కడ వైద్యానికి ధనికుడూ, పేదవాడు అనే తేడా లేదు. అక్కడ డాక్టర్లు పేషంట్ కి , వారి రోగ నివారణకు ప్రాధాన్యతనిస్తారు తప్ప ధనికుడి రోగాన్నైతే ఒక లాగా, పేద వాడి ప్రాణాన్ని అయితే ఒక లాగా వైద్య నిర్వహణ ఉండదు. అలాగే ఆసుపత్రులు కూడా పేదవారై, డబ్బులు చెల్లించలేని వారైతే, ఆ ఆసుపత్రి వారు రోగిని వైద్యం చెయ్యకుండా బయటకు పంపకూడదు. వారికి ఉచితంగా వైద్యం చేసి తీరవలిసిందే. అక్కడ ప్రాణానికే విలువగాని ధనిక పేదరికానికి కాదు. మన వాళ్ళు అలాంటివి ఎందుకు ఆచరించరు ?

అక్కడ డాక్టర్లు తప్పు చేసే పరిస్థితి కనిపించదు. వారు ఎంతో దీక్షగా జాగ్రత్తగా రోగిని చూస్తారు. కారణం వారు ఏ చిన్న పొరపాటు చేసినా వారి లైసెన్సు క్యాన్సిల్ చేసి ,వారి వైద్య వృత్తికి స్వస్తి పలుకు- తుంది ప్రభుత్వం. అందుకే డాక్టర్లు ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తారు. మన దేశంలోనూ ఇటువంటి పరిస్థితి రావాలని కోరుకుందాం.

తీగవరపు శాంతి



# పాఠకుల స్పందన

1. భువన చంద్రగారి ఆలోచనా శక్తికి జోహార్లు. వారు ప్రజల కోసం కథ ద్వారా అందించిన వేప చెట్టు ఉపయోగాలు ఎన్నో ఎంతో చక్కగా వివరించారు. ప్రతీ నెల వారి కథలో కొత్తదనం ఉంటోంది. వారికి మాధన్యవాదాలు .

**శిరీష , శ్రీమతి లావణ్య , శ్రీ రమేష్ --- కాకినాడ. శ్రీమతి అమృత వల్లి , శ్రీమతి లక్ష్మి --- నరసాపురం.**

2. శీతాకాలంలో అందరూ ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, తీసుకోవలసిన పండ్లు, కూరగాయల గురించి చాలా బాగా చెప్పారు.

**శ్రీ లోకేష్ , శ్రీమతి అనసూయ --- పూనా . శ్రీమతి కరుణ, శ్రీమతి జానకి ---పిఠాపురం.**

3. పాలెపు బుచ్చిరాజుగారు వ్రాస్తున్న బొమ్మలు చెప్పిన కథలు చాలా ఆసక్తిగా ఉంటున్నాయి. ప్రతీ నెల ఈ కథల కోసం ఎంతో ఎదురుచూస్తున్నాము.

**శ్రీమతి సుశీల , శ్రీమతి అనంత లక్ష్మి ----పొద్దుటూరు. శ్రీ కనకారావు , శ్రీమతి లలితా ---బెంగళూరు.**

4. డా. కవన శర్మ గారు వ్రాస్తున్న రసాయన శాస్త్రం బుఙ్రికి బాగా పదును పెడుతోంది. చాలా ఇంట్రస్ట్ గా ఉంది. భూమీ రూపుదిద్దుకోవడం గురించి, విశ్వము ఏర్పడడం గురించి ఎంతో వివరంగా చెప్పి మాకు తెలియని ఎన్నో విషయాలు తెలియ జేశారు.

**శ్రీ కమలేష్ , శ్రీ నవీన్ ----ఢిల్లీ . శ్రీమతి కమల పిఠాపురం.**

5. మేఘమాల సీరియల్ సస్పెన్స్ తో చాలా బావుంటోంది. ఎంతో ఆసక్తి గా ఉంటోంది.

శ్రీమతి అపర్ణ, శ్రీ రాజశేఖర్ ----- కరీంనగర్. శ్రీమతి భారతి , శ్రీమతి లావణ్య --- బొంబాయి.

6. 'డీమానిటైజేషన్' గురించి శ్రీకాంత్ గారు బాగా వ్రాసారు.

**శ్రీ మురళీ కృష్ణ , శ్రీమతి రవళి ---- నిజామాబాద్. శ్రీమతి లలిత, శ్రీ రామ మోహన్ --- గుంటూరు.**

7. కాశీ క్షేత్రం గురించి ఎంతో అత్యద్భుతంగా అందిస్తున్న మురళీ కృష్ణ గారికి మా హృదయ పూర్వక నమస్సులు. కాశీ విశ్వేశ్వరుడ్ని చూసినంత ఆనందం కలుగుతోంది.

**శ్రీ కోటేశ్వర రావు , శ్రీమతి లక్ష్మి రాజ్యం --- హైదరాబాదు. శ్రీమతి సుమిత్ర, శ్రీమతి మానస, శ్రీ రామారావు ---- ఏలూరు.**

8. తెలుగు భాషకే గొడుగులా పట్టి, గిడుగువారి గురించి ఎంతో చక్కగా వ్రాసారు పోడూరి శ్రీనివాస రావుగారు. ప్రతీ నెలా ఒక్కొక్కరి గురించి ఎంతో అద్భుతంగా అందిస్తున్నారు.

**శ్రీ సురేష్, శ్రీ ప్రసాదరావు ----- ఆదిలాబాదు. శ్రీమతి అఖిల, శ్రీ నరసింహారావు ---సికింద్రాబాదు.**

9. సంస్కృత పాఠాలను ఎంతో సులువుగా అర్థమయ్యేటట్టు గా మాకు అందిస్తున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంది. వారికి మా ప్రత్యేక కృతజ్ఞతలు.

**శ్రీమతి మాధవి, శ్రీమతి అమల --- వరంగల్ . శ్రీ హనుమంతరావు , శ్రీమతి సావిత్రి ---- విజయనగరం**

10. వల్లూరి సుబ్రహ్మణ్య శర్మ గారు అందిస్తున్న 'మోచేతి పొడువు' చాలా బావుంది. సమస్యలు, పరిష్కారాలు రకరకాలుగా బాగా వ్రాసారు.

**శ్రీ పురుషోత్తమ రావు, శ్రీ శ్రీనివాసరావు ----- బొంబాయి. శ్రీమతి అపర్ణ --- వరంగల్.**

11. 'మాఊరి నందుల కథ' మా పల్లెటూరు విశేషాలను గుర్తుచేస్తూ చాలా బావుంటోంది. ఫోటోలు కూడా బావున్నాయి.

శ్రీ నర్సింహ మూర్తి , శ్రీ జగన్నాథం --- రాజమండ్రి. **శ్రీమతి భారతి --- హైదరాబాదు.**

# భువనచంద్ర



## ఆకర్షణ

"అమ్మా... ఆ బొమ్మ కొనిపెట్టవూ?" అడిగింది బుజ్జి. నిట్టూర్చింది నిర్మల. కొనవచ్చు. కానీ, రాత్రికి బియ్యం వుండవు. పోనీ మధ్యాహ్నపు భోజనంలో మిగిలిందేమైనా వుంటే పిల్లకి ఆ కొంచెమూ పెట్టి తానూ పస్తు వుండొచ్చు. కానీ లేదే. ఉన్న డబ్బు ఒక రోజు బియ్యానికీ, పాప ఇంజక్షన్ ఖర్చుకీ సరిపోతుంది.

"అమ్మా.. అన్నం కూడా వద్దే.. ఆ బొమ్మ బాగుంది...కొనివ్వవూ..." ఆశగా నిర్మలని చూస్తూ అడిగింది బుజ్జి. ఆ పిల్ల వయసు ఆరేళ్ళు. గత రెండేళ్ళనుంచీ ఏదో జబ్బు. వారానికొక్క ఇంజక్షన్ ఇచ్చి తీరాలని డాక్టరన్నాడు. ఇవ్వకపోతే విషమిస్తుందట. మళ్ళీ నిట్టూర్చింది నిర్మల. తల్లి నిట్టూర్పుని అర్థం చేసుకుందేమో, నిశ్శబ్దంగా ముందుకు నడిచింది బుజ్జి. మౌనంగా బుజ్జి వెనక నడుస్తూ ఆలోచిస్తోంది నిర్మల.



ఓ చిన్న పిల్ల, 'బొమ్మ' కావాలనుకోవడం సహజం. అదో అత్యంత సహజమైన కోరిక. కానీ, ఆ అతిచిన్న కోరికను కూడా తీర్చలేని పరిస్థితులను కల్పించింది ఎవరూ? మరో అయిదేళ్లో మూడేళ్లో గడిచేసరికి బుజ్జి దృష్టి బొమ్మలమీద వుండదు. సాటి పిల్లలు వేసుకునే బట్టలమీద వుంటుంది. కనీసం అప్పుడైనా ఆ పిల్ల కోరుకున్న బట్టల్ని తను కొనిపెట్టగలదా? అసలింతటి తప్పు ఎలా జరిగిందీ, ఎందుకు జరిగిందీ? ఆలోచిస్తూ నడుస్తోంది నిర్మల. ఆమె గుండెల్లో బాధ. ఆఫ్టర్ ఆల్ ఓ పిల్ల అడిగిన అయిదు రూపాయల బొమ్మ కొనలేకపోయినందుకు. తక్కున తన తల్లి గుర్తుకొచ్చింది నిర్మలకి.

"తీసుకోవమ్మా... నీకు ఏది కావాలో అది తీసుకో" బుజ్జగిస్తున్న తల్లి స్వరం చెవుల్లో వినిపించింది.

"నాకేం వద్దు" తన మాట. కళ్ళల్లో నీళ్లు తిరిగాయి నిర్మలకి. తల్లిదండ్రులు ఎంత గారాబంగా పెంచారు. అబ్బ.... ఎన్ని గొప్ప సంబంధాలు తెచ్చారూ! ఒప్పుకుంటేగా తనూ. చివరికి ఓ ఆటో డ్రైవర్ ఆకర్షణలో పడి జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకుంది. మొండితనం వాళ్ళ చదువు పదో తరగతి దాటలేదు. ఆ మొండితనమే నగలతో సహా ఇంట్లోంచి పారిపోయి ఆటోవాడ్ని పెళ్లి చేసుకునే దుస్థితికి తెచ్చింది. మరిప్పటి వొంటరితనం? సుదీర్ఘంగా నిట్టూర్చింది నిర్మల. దానికి కారణమూ మొండితనమే. అతను మంచివాడే. జీవితా-

న్ని కొద్దో గొప్పో అర్థం చేసుకున్న-వాడే. అర్థం చేసుకోంది తనే. నోటి దురుసు. ప్రేమని పెంచేదీ 'మాటే', పెరిగిన ప్రేమను త్రుంచేదీ 'మాటే'. 'మాట' కున్న శక్తిని తెలుసుకో-లేక మూగబోయాను' అనుకుంది నిర్మల.

బొమ్మను చూసి ఆకర్షణలో పడింది ఒకరైతే, మనిషిని చూసి ఆకర్షణలో పడింది మరొకరు.

రకరకాల వస్తువులు... రకరకాల దుస్తులు... రకరకాల వాహనాలు.. రకరకాల పథకాలు... అన్నీ ఆక-ర్షించేవే. కొన్ని మనసుని ఆకర్షి-స్తే కొన్ని మనిషిని ఆకర్షిస్తాయి. వాటివెంట పడతాం. ఉన్నదాన్ని కోల్పోతాం.

ఒక్కసారి చూడండి.

పక్కింటి పార్వతమ్మ గారు 'వాషింగ్ మెషిన్' కావాలని మోజుపడి, మొగుడ్ని సాధించి, వాయిదాల పద్ధతిలో వాషింగ్ మెషిన్ సాధించింది. వాయిదాలు పూర్తయ్యేలోపలే ఆ మెషిన్ని మూ-లపారేసి పనిమనిషి చేత బట్టలు ఉతికిస్తోంది.

ఇరుగింటి ఈశ్వరీబాయి వాక్యూమ్ క్లీనర్ ని కొనిపించడం కోసం ఇంటినే రణరంగంగా మార్చింది. ప్రస్తుతం ఆ వాక్యూమ్ క్లీనర్ అటక మీద పడివుంది. బూజు పట్టి ని-ట్టూరుస్తోంది.

కంటికి ఇంపైన ప్రతిదీ అద్భుతం-గానూ, అత్యవసరంగానూ కని-పిస్తుంది. కానీ, చేతికొచ్చాక కానీ తెలీదు దానివల్ల వచ్చే అనర్థం. ఒక్కసారి మన ఇంట్లో వుండే వస్తువుల్ని మనమే గమనిస్తే అర్థ-మవుతుంది ... వృథాగా ఎంత ధనాన్ని నీటిపాలు చేశామో. అలాగే బట్టలు! గుట్టలు గుట్టలుగా కొ-నిపడెయ్యడం. వాటిని నిజంగా ఎన్నిసార్లు తొడుగుతున్నాం, పోనీ, పాత బట్టలనైనా జనాలు పే-దసాదలకి పంచుతారా అంటే, నూటికి తొంభై పాళ్ళు పంచరు. ఎందుకంటే, పంచబుద్ధి కాదు. 'ఇంత ఖర్చు పెట్టి కొన్నది పం-చడానికా?' అని మన మనసు మననే నిలదీస్తుంది. మనకీ ఇత-రులకీ కూడా వుపయోగపడని ఆ వస్తువులు, దుస్తుల వల్ల ఏమి ప్రయోజనం. దీన్నే ఓ సామెతగా మన పెద్దలు మలిచారు. 'గడ్డివా-ము దగ్గర కుక్క కాపలా' అని. ఆ కుక్క గడ్డిని తినదు. గడ్డే ఆహార-మైన ఆవుని తిననివ్వదు. చలికి వణికే ఓ పేదవాడిని మీరు రోజూ చూస్తూ వున్నా, ఒక్క చొక్కాని వాడికి ఇస్తారా? పాత చొక్కాలు దానం చెయ్యనివాడు కూడా, పుణ్యం కోసం వేలూ వందలూ ఖర్చు పెట్టి పూజలు చేస్తాడు. రకరకాల దీక్షల పేరుతో గుళ్ళు గోపురాలు చుట్టివ-స్తాడు.... ఆలోచించండి... పుణ్యం వస్తుందా?

"అబ్బాయ్... ఈగని ఎప్పుడైనా చూశావా? ఎప్పటికప్పుడు కాళ్ళని శుభ్రం చేసుకుంటూనే వుంటుంది. మళ్ళీ అదే కాళ్ళకి బురదనీ, నానా చండాలాల్నీ అంటించుకుం-టుంది. దాన్నించి మనం నేర్చు-కోవాల్సింది చాలా వుంది. ఎప్పు-టికప్పుడు అవసరం లేని వాటిని వదిలించేసుకో. అవి ఎంత ఆకర్ష-ణీయమైనవైనా సరే. అన్నిటికంటే ముందు వదిలించుకోవాల్సింది అనవసరమైన ఆలోచనల్ని. క్షణ-క్షణానికీ చెదలు పుట్టుకొచ్చినట్లు మనసులో ఆలోచనలు పుట్టుకొ-స్తూనే వుంటాయి. ఎప్పటికప్పుడు వాటిని విదిలించి, వదిలించుకో-కపోతే కొండలు పెరిగినట్టు పెరు-గుతుంటాయి. So, clean your mind first. ఆ తరవాత యీగలా మళ్ళీ నానా చెత్త మీదా మనసుని వాలనీకు. నీ మనసు ఎప్పుడై-తే ఆకర్షణలకి లోనవుతుందో, ఆ క్షణమే అసలైన 'నిన్ను' నీవు కో-ల్పోతావు. అని అన్నారు స్వామీజీ ఓనాడు. వెంటనే అర్థం కాకపో-యినా ఇప్పుడు అర్థమయింది.

అందుకే ప్రియ పాఠకుడా... ఇంటిలోనూ, మనసులోనూ పేరుకుని వున్న చెత్తని తొలగించు. అప్పుడు సరికొత్త, సరైన పాఠాలు నేర్చుకోవడానికీ, సరైన మార్గంలో సాగడానికి తగినంత 'జాగా' లభి-స్తుంది.

"నీకు ఉపయోపడనిదాన్ని దగ్గరుంచుకుని కుక్క కాపలా కాయకు. అది ఎవరికి ఉపయో-గపడుతుందో వారికి ఆనందంగా ఇచ్చెయ్. మనసుకి ఖచ్చితం-గా తృప్తి లభిస్తుంది" అని కూడా ఆనాడు స్వామీజీ బోధించారు. అదే యీనాడు నేను మీకు అంది-స్తున్నాను.

శ్రీ గురుభ్యో నమః

నమస్సులతో... శుభాకాంక్షలు.

(మళ్ళీ కలుద్దాం)

# పమ్మి భారతీ శర్మ



# పెరుగు - సంపూర్ణాహారం

తెల్లని అన్నం మీద గెడ్డ పెరుగు వేసి ... మెత్తగా కలిపి అమ్మ పిల్లలకు తినిపిస్తూ అంటుంది: 'పెరుగు అన్నం తినాలి.. ఇది తింటే ఆంజనేయస్వామి అంతబలం వస్తుంది! చూడు, అప్పుడే నీకెంత బలం వచ్చిందో' అంటూ కథలు చెప్తూ పెరుగన్నం అలవాటు చేస్తుంది. ఎన్ని తిన్నా ఆఖరున రెండు ముద్దలు పెరుగన్నం తింటేనే... ఆ భోజనం తిన్న తృప్తి మనకు. పెరుగు మంచి ఆహార పదార్థం. పాలను బాగా మరిగించి, చల్లార్చి, గోరువెచ్చని పాలల్లో 3,4 చుక్కలు మజ్జిగ వేసి మూతపెట్టి కదపకుండా 3 నుండి 4 గంటలు కదపకుండా ఉంచితే గట్టి పెరుగు తయారవుతుంది.

పాలకంటే పెరుగు ఇంకా మంచిది అని ఎందుకంటారంటే పాలలో ఉండే ప్రోటీన్స్ కంటే పెరుగులో ఉండే ప్రోటీన్స్ ను మన శరీరం త్వరగా జీర్ణం చేసుకుంటుంది. అందుకేనేమో మన పూర్వీకులు పెరుగు ( లేదా మజ్జిగ) ను మన ఆహారంలో భాగంగా చేశారు.

ప్రస్తుతం మన జీవన శైలి కావచ్చు, దినచర్యలలో మార్పులు, ఒత్తిడి, ఆహారపు అలవాట్ల వల్ల కావచ్చు.... చిన్న పెద్ద అనే భేదం లేకుండా అన్ని వయసులవారూ ... అజీర్ణము, గ్యాస్, మలబద్ధకముతో బాధ పడుతున్నారు. పెరుగు శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. జీర్ణకోశంలో పెరిగే



హానికరమైన బ్యాక్టీరియాను పెరగకుండా చేస్తుంది. అందుకే పిల్లలకు చిన్నతనం నుండి పెరుగు, పెరుగన్నం అలవాటు చెయ్యాలి. బజారులో దొరికే రకరకాల చిప్సులు, పిజ్జాలు, మంచూరియాలు కొనమని పిల్లలు మారాం చేస్తారు. చాలా పార్టీలలో అవే ప్రధాన ఆహారంగా కూడా ఉంటున్నాయి.

అవి ఏమి తిన్నా..ఆఖరున ఇంటికి వచ్చాక ఒక కప్పు, పెరుగన్నం లేదా మజ్జిగ పిల్లలు త్రాగేలా మనం అలవాటు చేయాలి. అవి తిన్నాక పెరుగన్నం తింటేనే అవి కొనిస్తామని షరతు పెట్టాలి. పెరుగు వల్ల కలిగే ప్రయోజనాలు వారికి వివరించాలి. ఈ పెరుగు ఆవుపాలతో తయారు చేస్తే ఆరోగ్యానికి ఇంకా మంచిదని ఆయుర్వేదం చెబుతోంది. ఇది వాత దోషాలను తగ్గిస్తుందట. కాని, రాత్రి పెరుగు కన్నా మజ్జిగ వాడడం, లేక పాలు వాడుకోవడం మంచిదని కూడా ఆయుర్వేదం చెపుతోంది. ఈ పెరుగును ఇంగ్లీష్ లో యోగర్ట్ అని, హిందీలో దహీ అని అంటారు. ఈ యోగర్ట్ రకరకాల రంగులలో, రుచులలో ఇతర దేశాలలో లభ్యమవుతాయి. మన దేశం లోని బెంగాలు ప్రాంతంవారు మట్టికుండలలో తీపి పాలను తోడుపెట్టి, మీఠా దహి అని తయారుచేస్తారు. చాలా రుచిగా ఉంటుంది. అలాగే

పంజాబ్, అమృత్ సర్ చుట్టుప్రక్కల ప్రాంతాలలో లస్సీ (మజ్జిగలో చక్కర వేసి) మీఠా లస్సీ అని తయారుచేస్తారు. ఇది కూడా చాలా రుచిగా ఉంటుంది. ఇంట్లో గిన్నెడు పెరుగు ఉంటే చాలు, ఎన్నో రకాల పదార్థాలు తయారు చేసుకోవచ్చు. అవి ఏంటో ఓసారి చూద్దాం....



పెరుగన్నంలో పచ్చి మిర్చి, అల్లం, మినపప్పు, ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, మిరియాలు, నేతిలో వేయించిన జీడిపప్పులు ఈ పోపులో కలిపి పెరుగు అన్నాన్ని దద్దోజనంలా చేసి... నైవేద్యంగా సమర్పిస్తాము. ఈ పెరుగన్నం ప్రయాణాలలో, పిక్నిక్ లలో కూడా తన స్థానం పదిలంగా ఉంచుకుంటుంది. చిన్న పిల్లలకొరకు పెరుగన్నంలో చిన్నగా తరిగిన మామిడిపండ్ల ముక్కలు, పైన దానిమ్మ గింజలు వేసి ఇస్తే చాలా ఇష్టంగా తింటారు. అలాగే అరటి పండు ముక్కలు, తొక్క తీసి సన్నగా తరిగిన ఆపిల్ ముక్కలు వేసి రుచిగా పిల్లలకు అందించి, వారికి పెరుగన్నం అలవాటు చెయ్యచ్చు. కాస్త వెరైటీగా తినడం ఇష్టపడేవారికి, కమ్మని పెరుగన్నంపై బూందీ జల్లి, జీలకర్ర పొడి, చాట్ మసాల జల్లి అందిస్తే పెరుగన్నంపై కరకర లాడే బూందీ ఆహా! ఏమి రుచి అనిపిస్తుంది.

పెరుగు కాస్త పులిసినట్లయితే.. పది పుదీనా ఆకులు, కొత్తిమీర కట్ట, పచ్చి మిర్చి, జీలకర్ర ముద్దగా నూరి, పెరుగులో కలిపితే పుదీనా చెట్నీ రెడీ. పుల్లని పెరుగుతో పుల్లట్లు, పెరుగుతో పునుకులు, చల్లపులుసు, మెంతిమజ్జిగ, ఆవడ పెరుగు, పొంగరాలు, ఇలా ఎన్నో వెరైటీలు మనం పుల్లని పెరుగుతో చేస్తాం. మరికొంతమంది, పుల్లని పెరుగును గిలక్కొట్టి, పలుచగా చేసి, నీటి బదులు ఈ మజ్జిగను కొలతగా పెట్టుకుని చల్ల ఉప్పుడు పిండి (బియ్యం రవ్వ)తో చేస్తారు చాలా రుచిగా ఉండే ఈ వంటకం మనమూ తయారు చేసుకోవచ్చు.

ఇక కమ్మని పెరుగుతో మనం తయ్యారు చేసే పెరుగు పచ్చళ్ళు, చెప్పుకోవడం మొదలెడితే ఇన్నీ అన్నీనా... కీరా పెరుగుపచ్చడి, వంకాయ, ఆనపకాయ, కాబేజీ , తోటకూర, పాలకూర, టమాటో, పొట్లకాయ, క్యారెట్టు, కొబ్బరి కాయ ఇలా అన్ని కూరగాయల్ని చిన్న ముక్కలుగా తరిగి, పోపు వేసుకుని.. నూనెలో మగ్గించి (లేదా ఉడికించి) చల్లారనిచ్చి పెరుగు కలపాలి. ఔషధ భరితం అయిన దూట పెరుగుపచ్చడి చేసుకోవడం మాత్రం మరచిపోవద్దు సుమా! రోజులో ఓ పూట పెరుగు కలిపిన పచ్చళ్ళు తింటే .. పెరుగు శరీరానికి తేమను అందించి చక్కని శరీర ఛాయను ఇస్తుంది. జీర్ణక్రియ చక్కగా జరిగేలా చూస్తుంది. ముఖ్యంగా చెప్పేది ఏమిటంటే పెరుగును తప్పనిసరిగా ఆహారంలో భాగంగా తీసుకోవడంవల్ల శరీరంలో కణాల క్షీణతను నిరోధించి వయస్సు కనపడకుండా చేస్తుందట.... మరి ఇంకా ఎందుకు ఆలస్యం... పెరుగును అమృతం అనేద్దాం... పిల్లలకు... పెద్దలకు పెరుగు రోజూ తినిపిద్దాం... ఆరోగ్యంగా, ఆనందంగా ఉందాం.

మళ్ళీ కలుద్దాం...

# పాలెపు బుచ్చిరాజు

## బొమ్మలు చెప్పిన బాలల కథలు



(గత సంచిక తరువాయి)

ఆడినమాట తప్పని మహారాజుకి ఇదంతా అగమ్యగోచరంగా ఉంది. చచ్చిపోయినవాడు తిరిగి వచ్చే-డన్న విషయం ఎంతకీ మింగుడు పడడం లేదు. ఏమైతేనేం? ఆ వచ్చిన వాడికి భార్యని అప్పగిం-చడం తన విధి. అని నిశ్చయిం-చుకుని, మార్గాంతరం ఆలోచిం-చసాగాడు. ఆఖరికి ఆమె భర్తతో సహగమనంచేసి స్వర్గానికి కదా! వెళ్ళింది.

కనుక ఇంద్రుడిపై దండెత్తి అతన్ని జయించి ఆ యువతిని తీసుకు రావాలని ఒక నిర్ణయానికి వచ్చాడు. వెంటనే ఇంద్రుడి మీద యుద్ధం ప్రకటించమని, సేనల్ని తయారు చేయమని, మంత్రి, సా-మంతులకి చెప్పాడు.

అప్పుడు ఆ వీరుడు వి-క్రమార్కుడి సత్యవాక్పాలనకి మె-చ్చుకుని, తన అసలు రూపంలో ప్రత్యక్షమయ్యాడు. అందరూ ఆశ్చర్యపోతుండగా, ఇది తన ఇంద్రజాల విద్య అని, దాన్ని చూపించడానికి ఆడిన నాటకం అని చెప్పాడు. మహారాజు చాలా సంతోషించి, "ఇంకా ఏమేమి విద్యలు వచ్చు"నని అడిగాడు.



అప్పుడా వైతాళికుడు చతుష్షష్టి కళల పేర్లు చెప్పి, అన్నిటిలోనూ ప్రవేశం ఉందని చెప్పాడు.

విక్రమార్కుడికి అతని విద్యాప్రీతి చాలా నచ్చింది. అతన్ని తగిన విధంగా ఎలా సత్కరించాలా అని ఆలోచిస్తున్నాడు. ఇంతలో అక్కడికి రాజభటులు వచ్చి "మహారాజా! పాండ్యరాజు మంత్రులు తమకు ఎనిమిది కోట్ల దీనారాలు , తొంభై మూడు ముత్యాల కావళ్ళు, ఇంకా ఏనుగులు, గుర్రాలు, కానుకగా తీసుకు వచ్చారు." అని చెప్పారు. వారిని ప్రవేశపెట్టమని ఆజ్ఞాపించి, ఆ వచ్చిన కానుకలన్నీ పూర్తిగా వైతాళికునికే ఇవ్వమని మంత్రులకి ఆదేశం ఇచ్చాడు.

చూశావా!భోజరాజా!ప్రపంచంలో ఎవరైనా అంతటి దానగుణ సంపన్నుడు ఉంటాడా?" అని అడిగింది బొమ్మ.

భోజుడు ముఖం వేళ్ళాడేసుకుని వెనక్కి మళ్ళాడు.

## ముప్పైఒకటో బొమ్మ కథ

ఏనాటికైనా అదృష్టదేవత కరుణించక పోతుందా అనే ఆశతో భోజుడు రత్నసింహాసనం చేరాడు. అక్కడ ఉన్న బొమ్మ కమ్మని మందహాసం చేసి ఇలా అంది. " రాజా! ఇప్పటికి ముప్పై ప్రయత్నాలు చేశావు. నీ పట్టుదల మెచ్చుకోవలసిందే! అయినా ఏం లాభం? దాన, వీర, శూర గుణాల్లో నువ్వు విక్రమార్కుడిని పోలలేవే! ఈ కథ విని నువ్వే నిర్ణయించుకో మరి. " అని ఇలా చెప్పింది.

"ఆ రాజు ఉజ్జయినిని ఏలే రోజుల్లో ఒకనాడు కాంతిశీలుడనే ఒక బిక్షుకుడు వచ్చి, రాజును దర్శించుకున్నాడు. రాజ దర్శనానికి వచ్చిన వాడు ఉత్తచేతులతో రాకూడదని ఒక చక్కని పండు ఇచ్చి, బహుమతులు అందుకుని మరీ వెళ్ళాడు. రాజుగారు ఆ పండుని కోశాధికారికి ఇచ్చేశాడు. ఇందులో పెద్ద విశేషమేమీ లేదు. కాని ఆ సాధువు ఇలా రోజూ ఒక ఫలం చొప్పున తెచ్చి ఇవ్వడం, దానిని రాజు మంత్రి, పురోహితుల్లో ఎవరో ఒకరికి ఇవ్వడం సుమారు పది సంవత్సరాలపాటు సాగింది.

ఇలా ఉండగా ఒకనాడు సాధువు ఇచ్చిన పండుని రాజు ఒక కోతికి ఇవ్వడం జరిగింది. అది కోతి చేష్టలతో దానిని అక్కడికక్కడే కొరికింది. అప్పుడు దానిలోంచి గింజలకి బదులు, ఒక అమూల్యమైన రత్నం బైట పడింది.

అప్పటికి సాదువు చేష్టలలోని ఆంతర్యం తెలుసుకుని, రాజు మొత్తం ఆయన ఇచ్చిన పళ్ళన్నీ వెనక్కి తెప్పించాడు. అన్నిటిలోంచీ, రత్నాలు బైట పడ్డాయి. అంత సంపదనీ విక్రమార్కుడు సేవకులకి ఇచ్చివేసి, సాధువుని, "ఇంత గొప్ప బహుమతి నువ్వు నాకు ఏ ప్రతిఫలం కోరి ఇచ్చావు? " అని అడిగాడు.

అప్పుడా సాధువు ఇలా అన్నాడు, " రాజా! నీ ఊహ సరైనదే! నేను పెద్ద సహాయాన్ని కోరే నీ దగ్గరికి వచ్చాను. అదేమిటో చెప్తుతాను విను. నేను కృష్ణ పక్ష చతుర్దశినాడు ఒక మర్రి చెట్టుక్రింద కూర్చుని శ్మశానంలోని పిశాచాల తృప్తికోసం హోమాలు చేస్తాను. దానికి నీ వంటి సాహసవంతుడి సహాయం కావాలి. "

అది విన్న విక్రమార్కుడు, అదెంత పని అని సరే! అన్నాడు. సాధువు సంతోషంగా వెళ్ళిపోయాడు. అనుకున్న ప్రకారం కృష్ణ పక్ష చతుర్దశినాడు మహారాజు మర్రి చెట్టుదగ్గరికి మాట తప్పకుండా వెళ్ళాడు. ఆ రాజు రాకకు సాధువు సంతోషించి, ఇలా అన్నాడు. " మహారాజా! ఇక్కడికి దగ్గరలో ఉన్న శ్మశానంలో ఒక పెద్ద ఇరుగుడు చెట్టు ఉంది. దాని మీద భేతాళుడు నివసిస్తున్నాడు. నువ్వు వెళ్ళి అతడిని ఇక్కడికి తీసుకు రావాలి. కాని ఒక చిక్కు ఉంది. నువ్వు వాడిని మోస్తూ ఉన్నంత సేపూ మౌనంగా ఉండాలి."

విక్రమార్కుడు, అందుకు అంగీకరించి, వెంటనే శ్మశానానికి ప్రయాణం కట్టాడు. అక్కడ రకరకాల పక్షులు, భయంకరమైన పాములు, పిశాచాలకు నివాస స్థానమైన చెట్టుకు, తలక్రిందులుగా వ్రేళ్ళాడుతున్న భేతాళుడిని చూశాడు.

( ఇంకా వుంది )

# శివసాయుజ్యం పొందిన శ్రీ వల్లూరి విశ్వేశ్వర సుబ్రహ్మణ్యా శర్మ

## అశ్రు నివాళి

### స్థంభించిన కలం ........

2012 జూన్ మాసం నుండి ధారా వాహికంగా "వల్లూరి విశ్వేశ్వర సుబ్రహ్మణ్యాశర్మ" గారి (VVS. శర్మ ) రచనలు పాఠకులకు అందివ్వడం ఎంతో అదృష్టంగా భావిస్తున్న తరుణంలో వారి రచనలు ఈ ఒక్క నెల మాత్రమే ప్రచురించగలుగుతున్నందుకు అత్యంత బాధాకరంగా ఉంది. జనవరి 13వ తేదీ రాత్రి మనలను వీడి, పర లోకాలకు వెళ్లడం సాహితీ లోకానికి తీరని లోటు .. వారికి నేను ఎప్పుడు ఫోన్ చేసినా ఒక్క వారం టైం ఉంటుందా? అని అడిగేవారు. అలాగే పంపండి అనడం జరిగేది . . కానీ శర్మగారు మాత్రం2 రోజుల్లో నే పంపేవారు. అలాగే Dec లాస్ట్ వీక్ ఫోన్ చేసాను. పిల్లలు వచ్చారు, హడావిడిగా ఉన్నాను అన్నారు. ఫరవాలేదు, ఒక్క పేజీ లేదా ఒక్క పేరా అయినా వీలు చూసుకుని వ్రాయం డి, మళ్ళీ నెల తీరుబడిగా వ్రాద్దురు గాని , కొత్తసంవత్సరం గ్యాప్ వద్దు అన్నాను. వారం టైం ఉంటుందా అన్నారు. ఫరవాలేదు పంపండి అన్నాను. ఆ రోజు 28వ తేదీ . అదే ఆఖరి మెయిల్ అని అనుకోలేదు .

చైతన్యం సంకల్పబలం పత్రికలో ధారావాహికంగా వెలువడిన VVS . శర్మగారి రచనలు:

1. గౌతముడు --- కంప్యూటర్స్ ;
2. కణాదుడు ---కంప్యూటర్లు.
3. జైమిని ---- కంప్యూటర్లు.
4. కపిలుడు --- కంప్యూటర్లు.
5. మృత్యువును జయించడం ఎలా?
   కఠోపనిషత్ చూపిన మార్గము.
6. విశ్వము --సృష్టి --- 1.
   ఆధునిక విజ్ఞానము --- వైదిక జ్ఞానము.
7. వైజ్ఞానిక రచనలకు తెలుగు వినియోగం /విస్తరణ / ఆధునీకరణ.
8. భారత దేశ చరిత్ర అధ్యయనం --- గత కాలానికి ఒక సాహస యాత్ర.
9. మోచేతి పొడుపు . (Nudge = a small push,probably.



1944 - 2018

ఇలా అత్యంత అద్భుతంగా వారి రచనా శక్తి ని చైతన్యం పాఠకులకు అందించిన ఒక మహనీయుడు ,వేదాంత తత్వవేత్త , ఆధ్యాత్మిక ,సామాజిక చారిత్రాత్మక విశ్వ విజ్ఞాన శాస్త్ర వేత్త , ఒక రీసెర్చ స్కాలర్, మృదు భాషి, ఇలా ఎంత చెప్పినా తక్కువే అనిపించే సరస్వతీపుత్రుడు, సాహిత్య, మానసిక బంధంతో అందరి మనసులకు చేరువైన ఆత్మ బంధువు. వారి జ్ఞాన సంపదను మనకందించి మానసికంగా దగ్గరయి, అందనంత దూరాలకు వెళ్లి, అతి సునాయాశంగా బాహ్య ప్రపంచానికి దూరమై భగవంతుని సన్నిధికి జేరిన భగవత్ భక్తుడు .

వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ , వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తోంది చైతన్యం సంకల్పబలం.

శ్రీ వల్లూరి విశ్వేశ్వర సుబ్రహ్మణ్య శర్మ గారు కృష్ణాజిల్లా విజయవాడలో 1944లో జన్మించారు. వీరు బెంగళూరులోనున్న భారతీయ విజ్ఞాన సంస్థ ఇంజనీరింగు విభాగంలో డాక్టరేట్ డిగ్రీ సంపాదించి అదే సంస్థలో 39 సంవత్సరములు పనిచేశారు. కంప్యూటర్ సైన్సు ప్రొఫెసరుగా మంచి పేరు తెచ్చుకొని 2006 లో రిటైరయ్యారు. తరువాత కూడా వీరు గౌరవహోదాలలో కొన్ని సంవత్సరాలు ప్రొఫెసరుగా ఉన్నారు. ప్రముఖ భారతీయ విజ్ఞానము మరియు ఇంజనీరింగు విద్యాసంస్థలలో (Indian Science and Engineering Academies) ప్రావీణ్యులుగా ఎన్నికకాబడ్డారు. అమెరికాలోనున్న విద్యాసంస్థలలో కొంతకాలము ప్రొఫెసరుగా ఉన్నారు. వీరి పర్యవేక్షణలో డాక్టరేట్ డిగ్రీలు పొందినవారు దేశవిదేశాల్లో పలు సంస్థల్లో ఉన్నతస్థానాల్లో పని చేస్తున్నారు. శ్రీ శర్మగారు సాంకేతిక రంగంలో ముఖ్యంగా రక్షణశాఖకు సంబంధించిన విషయాలలో (Artificial Intelligence, Pattern Recognition, Aerospace Systems మున్నగునవి) పరిశోధనలు చేశారు.
శ్రీ శర్మగారు ఇంజనీరింగు విద్యారంగంలోనే కాక తమ గురువులు శ్రీ సద్గురు కందుకూరి శివానందమూర్తి గారి సాంగత్యంలో ఆధ్యాత్మిక, సామాజిక రంగాలలో విజ్ఞానశాస్త్ర పరంగా అవగాహన పెంచడానికి పెక్కు విషయాలను అధ్యయనం చేసి తమ అనుభవాన్ని శాస్త్రజ్ఞులతో పంచుకొనేవారు. ఈ ప్రయాసలో భారతీయ తత్వశాస్త్రము, ఆస్తిక దర్శనములు (న్యాయము, వైశేషికము, వేదాంతము, మీమాంస, సాంఖ్యము, యోగము) మున్నగునవి తమ అభిరుచిని అనుసరించి అధ్యయనము చేసి ఇంగ్లీషులోను, తెలుగులోను ప్రత్యేక స్ఫూర్తినిచ్చే అనేక వ్యాసాలు, మరియు తమ గురువులు రచించిన గ్రంథాలకు ఆంగ్లాను వాదాలు సుపథ, సంకల్పం - చైతన్యబలం వంటి పత్రికలలో ప్రచురించారు. దైనందిక జీవనంలో నిత్య మూ ఎక్కువ కాలము తమ వ్యాసంగములలో నిమగ్నమై ఉంటూ ఉండేవారు. మిత్రుల చేత అభిమానంతో వి.వి.యస్ గా పిలువబడే శ్రీ శర్మగారు తమ కుటుంబ సభ్యులతో ఎప్పటిలాగున ముచ్చటిస్తూ 2018 సం. జనవరి 13వ తేదీ రాత్రి గం 10:40 కు అతిసునాయాసంగా తుదిశ్వాస విడిచి శివ సాయుజ్యం పొందారు. శ్రీ విశ్వేశ్వర సుబ్రహ్మణ్య శర్మగారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకొంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను. - ప్రొ.వేదుల సుబ్రహ్మణ్యం

వల్లూరి విశ్వేశ్వర సుబ్రహ్మణ్యశర్మ గారు మనకందని దూరాలలో ఉన్న స్వర్గధామాలకి వెళ్లిపోయారన్న వార్త చైతన్యం సంపాదకులు తెలుపగానే, చైతన్యం-సంకల్పబలం పత్రికద్వారా భౌతికవస్తుప్రపంచంలో మునిగి తేలుతున్న పాఠకులను ఆధ్యాత్మికతత్త్వాన్ని మరువకూడదని సదా హెచ్చరించే ఓ అభిజ్ఞుడు మనకిక లేరనిపించింది. భారతదేశ చరిత్ర అధ్యయనం-గతకాలానికి ఒక సాహసయాత్ర వ్యాసపరంపరతో ఆయన ఈ సందేశాన్ని అందజేస్తూనే వచ్చారు. చివరిగా ఒక మోచేతి పొడుపుతో 'నువ్వు నువ్వుగా నీకున్నవిచక్షణాజ్ఞానాన్ని సరిగా అంచనావేసుకొని మనుగడ సాగించు' అన్న ఓ హెచ్చరికచేసి కైవల్యం పొందారు. ఆయన లేకపోయినా ఇంతవరకూ అందించిన సందేశాలు చైతన్యంలో నిత్యం మెదుల్తూనే ఉంటాయి.

హనమకొండ (24-01-2018) - పింగళి వెంకట రమణ రావు

నేను 1962 లో IISc లో Ph. D విద్యార్థి గా చేరే సరికి వల్లూరి శర్మ గారు BE ( ఎలక్ట్రికల్ ఇంజనీ-రింగ్) చదువుతున్నారు. BSc పాస్ అయిన వాళ్ళల్లో యూనివర్సిటీ రాంకులు వచ్చినవారిని మాత్రమే (వారిలోను అందరిని కాదు ) మా ఇన్స్టిట్యూట్ లో చేర్చు కునే వారు . ఎందుకంటే మొత్తం దేశానికి 20 మాత్రమే సీట్లు ఉండేవి అంటే వల్లూరి శర్మ గారు విద్యార్థిగా మెరికలాంటి వారన్న మాట అయన ఆచార్య బులుసు లక్ష్మి దీక్షితుల వద్ద తరవాత, Ph.D. చేసా రు.

ఆయన కలన విద్యలో. యాంత్రిక మేధస్సు నైపుణ్యవ్యవస్థల్లో ఆచార్యుడు గా IISc లో పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయనకీ భాషా శాస్త్రాలు, న్యాయ వైశేషిక ( మనక )తర్క శాస్త్రాలు వృత్తి రీత్యా అవసరమై అభ్యసించిన అభిమాన శాస్త్రాలు. ప్రవృత్తి రీత్యా జ్ఞాన మార్గం ఇష్టం ఈయన సద్గురు శివానంద మూర్తి గారికి బంధువు, శిష్యుడు.

ఆయన ఎన్నో సాంకేతిక వ్యాసాలు అంతర్జాతీయ జర్నల్స్ లోను, భారతీయ సనాతన ధర్మం గురించిన ఎన్నో వ్యాసాలు సుపథలోనూ వ్రాసారు. ఈయన కి ఇంగ్లిష్ లో అయినా తెలుగులో అయినా అలవోకగా వ్యాసాలు వ్రాసే నేర్పు ఉన్నది.

మనిషి సౌమ్యుడు. సరసుడు. సంభాషణా చతురుడు వివేకి. జ్ఞాన సంపన్నుడు. అయితే తన మతాన్ని ఎవరైనా ఆక్షేపిస్తే మాత్రం ఖండించకుండా ఉండలేని వాడు. హిందువులపట్ల RIP ప్రయోగాన్ని నిరసించినవాడు.

మరణం పట్ల భయం లేని వాడు. మరణం కోసం ఎదురుచూడని వాడు బతికి ఉన్నన్నాళ్లు తనకి తెలిసింది ఇతరులకు చెప్పటానికి ప్రయత్నించిన వాడు. ఆయన మాకు మాత్రమే కాక తన భార్యకి ముగ్గురు కూతుళ్ళకి మంచి స్నేహితుడు. ఆయనతో ఏ మాత్రం పరిచయం ఉన్న వారికైనా తన మరణంతో ఆయన లోటు చేసినవాడు. 55 సంవత్సరాల స్నేహంలో ఎన్నో జ్ఞాపకాలు. ఎన్నో చర్చలు వాద ప్రతి వాదాలు. ఆయన పైలోకాలకి ఏ దారిలో వెళ్ళాలో తెలిసినవాడు. అల్లాగే పయనించినవాడు ఆయన ఆ లోకాల్లో. బ్రహ్మానందం అనుభవిస్తూ మనకి తన మరణానికి విచారించవద్దని చెప్తున్నాడు. నాకు వినపడుతోంది అల్లాగే శర్మ గారు. కానీండి . - కవన శర్మ

వల్లూరి విశ్వేశ్వర సుబ్రహ్మణ్య శర్మ గారు ఎంతోకాలంగా తమ ప్రజ్ఞాపాటవాలతో, అతులిత విజ్ఞానసంపదతో పత్రికను చైతన్య పరుస్తూ వారి సేవలను అందించి, ఎంతో మందికి అనేక విషయాలు సులభ గ్రాహ్యంగా విశదపరుస్తూ , ఇక్కడ తమ పని పూర్తైందని, అక్కడ పత్రిక కోసం తమ రచనలు ఆవశ్యకమనే స్వర్గలోకపు పిలుపు అందుకుని, వారినీ చైతన్య పరచను వెళ్ళిన వారి ఆత్మకు శాంతికలగాలని మనస్పూర్తిగా భగవంతుని ప్రార్థిస్తున్నాను. మనలో ఒకరుగా ఉంటూ ప్రతిమాసం వారి అమూల్య రచనలు అందిస్తూ ఉన్న ఒకసోదరుని చైతన్యం కోల్పోవడం విచారకరమైనా అందరికీ తప్పని ఈప్రయాణంలో ఒకరు ముందూ వెనకా అని భావించాల్సి ఉంది.

వి.వి.ఎస్.శర్మగారూ మాకోసం ఎదురుచూస్తారుగా!

రాకమానదు మృత్యువు రాజుకైన
పోకమానరు ఎంతటి ప్రభువులైన
రాకపోకలు లేనిది ఆత్మ ఒకటె
నాకలోకాన నిలువుమా శాశ్వతముగ. నమోవాకాలు.

- ఆదూరి.హైమావతి, పుట్టపర్తి.

## మృత్యోర్మా అమృతం గమయ

వి వి ఎస్ శర్మ గారు చాలా సున్నితమైన వ్యక్తి. వారి రచనలు కూడా చాలా సున్నితంగా, సునిశితంగా, స్పష్టంగా వుంటాయి. అపారమైన అనుభవం వారి రచనల వెనుక దర్శనమిస్తుంది.

చాలామంది గొప్ప రచయితల్లాగా, ఆయనకు తోచింది ఏనాడూ ఆయన వ్రాయలేదు.

'నేను రాసింది, చర్చించింది ఇతరులకు అర్థం కావాలి. అవి కేవలం అక్షరాలలో మాత్రమే కాక, చదువరుల మస్తకాల్లోకి కూడా వెళ్ళాలి' అనే దృక్పథం తోనే రచనలు చేసారు ఆయన.

వి వి ఎస్ శర్మ గారు మృదు స్వభావి. ఎవ్వరినీ నొప్పించని మనస్తత్వం వారిది.

వారు మన మధ్యనుంచి తెలియని లోకాలకు తరలిపోవడం నిజంగా బాధాకరం. వారు ఇక మన మధ్య లేరన్న సంగతి విని మనసు మూగబోయింది.

మా పరిచయం 'సంకల్పబలం' లోనే. ఓ సహ రచయితని పోగొట్టుకోవడాన్ని నా మనసు జీర్ణించుకోలేకపోయింది. కానీ తప్పదు. 'జనన మరణ చక్రం' లో ఇరుక్కున్నవాడికి శరీరం త్యజించక తప్పదు. అంతే కాదు ... మరో శరీరాన్ని తొడుక్కోకా తప్పదు.

వారి ఆత్మకు శాంతి కలగాలనీ, వారు భగవంతునిలో ఐక్యమవ్వాలనీ, కనిపించని ఆ పరమేశ్వరుడ్ని ప్రార్థిస్తూ........ వారి కుటుంబ సభ్యులకు, సన్నిహితులకూ, మన 'చైతన్యం సంకల్పబలం' పాఠకులకూ నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసుకుంటూ, వారి అడుగుజాడల్లో రాబోయే రచయితలు నడవాలని కోరుకుంటూ.......

- భువనచంద్ర

వి.వి.శర్మ గారి వంటి గొప్ప జ్ఞానిని కోల్పోవడం చాలా బాధాకరమైన విషయము.
“మనుష్య సమస్యలు,పరిష్కారాలు - ఉత్తమ పరిష్కారాలు తెలియ చెప్పడం, అవగాహనా పరంగా చైతన్యం మాస పత్రిక ద్వారా పాఠకులకు అందించడం “ మామూలు విషయం కాదు ..అటువంటి మంచి సంగతులను అందిస్తున్న గొప్ప వ్యక్తి ఈనాడు లేకపోవడం “చైతన్యం మాస పత్రికకు, తోటి రచయితలూ- రచయిత్రులకు, పాఠకులకు” ఎంతో తీరని లోటు.

- శ్రీమతి నండూరి సరోజాదేవి

గత కొన్నేళ్లుగా మన చైతన్యం సంకల్పబలం పత్రికకి రచనలు చేస్తున్న శ్రీ వల్లూరి విశ్వేశ్వర సుబ్రహ్మణ్య శర్మ గారు దివంగతులయ్యారని తెలిసి చాలా విచారించాను. ఈ పత్రిక కుటుంబ సభ్యులలో ఒకరైన శ్రీ శర్మ గారు లేని లోటు తీర్చ లేనిది. వారి కుటుంబ సభ్యులకి సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలుగు గాక అని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు
పాలెపు బుచ్చిరాజు.

## శ్రద్ధాంజలి

అందరికీ ఆయన వి.వి.ఎస్. శర్మ బాబయ్య గారు. కానీ ఆయన పూర్తి పేరు శ్రీ వల్లూరి సుబ్రహ్మణ్య శర్మ గారని ఎంతమందికి తెలుసు? చైతన్యం- సంకల్పబలం పత్రికకు గత ఐదేళ్లుగా తన ధైన శైలిలో 'పాఠకులను చైతన్య పరిచారు. వారు వ్రాసిన వ్యాసాలు ఆధ్యాత్మిక పరంగా, శాస్త్ర పరంగా చారిత్రిక పరంగా పాఠకులను ఆలోచింపచేసేవిగా ఉండేవి. . 'చైతన్యం' గత పత్రికలో భారత దేశ అధ్యనం -- గత గత కాలానికి ఒక సాహస యాత్ర, వాల్మీకి రామాయణం -- ఉత్తర కాండ , శంబూక కథ, మోచేతి పొడుపు, బుద్ధి వివేకం, విచక్షణ మొదలైన వ్యాసాలలో శర్మగారు ఆధ్యాత్మిక, పౌరాణిక సంబంధిత విషయాలపై వ్యాసాలు వ్రాసి, పాఠకుల ఆదరాభిమానాలు చూరగొన్నారు.

తమ గురువులైన శ్రీ కందుకూరి శివానంద మూర్తి గారి బోధలను పాఠకులకు అర్ధమయ్యే రీతిలో, సులభ గ్రాహ్యంగా తెలియ జేయడంలో శ్రీ శర్మ గారు అందెవేసిన చెయ్యి.

వారు చైతన్యం పత్రికకు జనవరి సంచికకు వ్రాసిన వ్యాసం మోచేతి పోడుపు - 2వ భాగం బహుశా వారి కలం నుండి 'చైతన్యం' పత్రికకు వ్రాసిన చివరి రచన అయ్యుండ వచ్చేమో!

ఏది ఏమైనా చైతన్యం పాఠకులు ఇక గొప్ప ఆధ్యాత్మిక, శాస్త్రీయ రచయిత రచనలు మిస్ అవుతున్నారు. ఇక వారి కలం నుండి రచనలు రావనే మాట బాధాకరంగా ఉంది.

వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియ జేస్తున్నాను.

- **పోడూరి శ్రీనివాసరావు**

---

# కీ.శే.వల్లూరి విశ్వేశ్వర సుబ్రహ్మణ్య శర్మ



## మోచేతి పొడుపు (భాగం – 2)

## (Nudge = a small push, probably

(గత సంచిక తరువాయి)

### బుద్ధి, వివేకం, విచక్షణ

**Are humans rational ?** అనే ప్రశ్నకు హేతుబద్ధమైన సమాధానములేదు. మరి మనుష్యుడు తన పరిస్థితిలో "సరియైన" నిర్ణయాలు ఎలా తీసుకోవాలి? కొన్న శాస్త్రాలలో ఈ ప్రశ్నకు సమాధానం ఉందా? ఈ ప్రశ్ననే అర్థ శాస్త్రవేత్తలు మరో విధంగా ఆలోచిస్తారు. (Limited rationality, bounded rationality) పరిమిత హేతుబద్ధత తో మనిషి తన సమస్యలకు పరిష్కారాలు కనుగొనగలరు. వాటిని యుక్తి యుక్తంగా సమర్థించుకోగలడు. ఇది వారి అభిప్రాయం. మనిషికి తన నిర్ణయం సరియైనదా? కాదా? అనే ప్రశ్న అనవసరం.. తన నిర్ణయాన్ని హేతుబద్ధంగా యుక్తియుక్తంగా సమర్థించుకోగలనా? అనేదే

ముఖ్యం. Human beings are often irrational but are rationalizing.

ఈ సందర్భంలోనే rationalist అనే వాడుక పదాన్ని కూడా పరిశీలించాలి. ఇక్కడకూడా ఆంధ్రభారతి నిఘంటువు సహాయం తీసుకుందాము. ఆక్షేపించువాడు, హేతువాది, తార్కికుడు అని అర్థాలు కనబడుతాయి. పదానికి ఉపయోగంలో తార్కికుడు కంటే వితండవాది అనే అర్థం సహజంగా గుర్తుకువస్తుంది. "జ్యోతిషం మూఢనమ్మకం" వంటి చిలకపలుకులు పలికేవాడు తాను rationalist ని అని చెప్పుకుంటాడు. ఉదాహరణకు, జ్యోతిషాన్ని గురించిన కొన్ని వాక్యాలను పరామర్శిద్దాం: 1 "జ్యోతిషం మూఢనమ్మకం" 2 "జ్యోతిషం ఒక వేదాంగం" 3. "జ్యోతిషం ఒక శాస్త్రం" 4 జ్యోతిషం ఒక సైన్స్. 5 జ్యోతిషం ఒక సూడోసైన్స్. (కృత్రిమ విజ్ఞానం) . ఏమాత్రం తర్కం తెలిసినా మొదటిది పరమ అసత్య వాక్యము (absolute falsehood), 2,3 సత్యవాక్యాలు. 4, 5 వ్యావహారిక సత్యాలు. మొదటి వాక్యం చెప్పినవానికి హేతుబద్ధత లేదు. 5వ వాక్యంలో కూడా హేత్వాభాస ఉంది.

ఇప్పుడు హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని(rational thinking) చూదాం. హేతుబద్ధమైన అనే విశేషణం ఆలోచన అనే నామవాచకమునకు సహజంగా చెందినది. మనము చెప్పిన వాక్యం మన ఇంద్రియానుభవమైనా, కొన్ని సహజ సిద్ధమైన సత్యాల (axioms) పై ఆధారపడి అనుమానించినదైనా, కొన్ని సత్యాలతో సారూప్యత కలిగియున్నా, ఆప్త వాక్యమైనా, ఒక ప్రామాణికమైన గ్రంథ వాక్యమైనా హేతుబద్ధమైనది అని భావించవచ్చు. ఈ విధంగా మనం మన వాక్యాలను సూనృత వాక్యాలుగా నిర్ణయించుకుంటాము. మన ప్రమాణాలు ఇతరులకు ప్రమాణం కాకపోవచ్చు. అందుచేత హేతుబద్ధత అనేది స్వయం నిర్ణయం పై ఆధారర పడి ఉంటుంది. అందుచేత అది పరిమితం.

ఇంతవరకు మన ఆలోచనా విధానం పాశ్చాత్య విధానం. . ఇదే సమస్యకు భారతీయ ఆలోచనా విధానంలో సమాధానం ఎలా ఉంటుందో చూదాం ఇది మన సంస్కృత పదాల వినియోగం పై ఆధార పడి ఉంటుంది, బుద్ధి, వివేకం, విచక్షణ తో బాటుగా అనేక పదాల అవసరం ఉంటుంది. మొదటి మార్గంలో mind-body problem రెండవ విధానంలో దేహాత్మభావనగా రూపు దిద్దుకుంటుంది. ఆంగ్లభాషలో mind అనేపదం యొక్క విస్తృతమైన అర్థం మన భాషలో మనసు అనే పదానికి లేదు.. మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము, ఆత్మ అనే పదాలు ఆలోచనావిధానాన్ని ప్రభావితం చేస్తాయి. మనసు ఆలోచనలకు స్థానం. ఇంద్రియములు, అంతః కరణమైన మనసు బాహ్య ప్రపంచ జ్ఞానాన్ని ఇస్తాయి. ఆలోచనలు ఒక పద్ధతిలో ఉండవు. ఒక బాహ్యవస్తువు పై ఆధారపడవు. వానిని క్రమ బద్ధం చేయడానికి అవసరమయేది బుద్ధి (intellect, intelligence). మనోబుద్ధులు శరీరంలో మెదడు కు సంబంధించిన లక్షణాలు మనిషి హేతువాద శక్తి వీనిపై ఆధారపడి ఉంటుంది. "విశ్వం పశ్యతి కార్యకారణతయా" అనే ఊహకు ఇవే ఆధారం. హేతువు లేక కారణం యొక్క అన్వేషణ వీని వృత్తి. మనో బుద్ధుల వ్యాపారాలను యాంత్రికంగా చేయగలమా? యాంత్రిక మేధస్సు (Machine Intelligence) ఇది సాధ్యమనే చెబుతుంది. అందుచేత మనం rational behavior అని చెప్పేది యాంత్రికమైన కౌశల్యం.. చిత్తాహంకారాలు భావావేశాలను, విభ్రమను కూడా కలిగిఉంటాయి. Humans are born irrational, and that has made us better decision-makers. .. అని చెప్పవచ్చు.

(ఇంకా చాలా ఉన్నా, వ్రాయటానికి శ్రీ వి వి ఎస్ శర్మ గారు లేరని తెలుపటానికి చింతిస్తున్నాం )

# డా.కవన శర్మ





## రసాయన శాస్త్రం

గత సంచిక తరువాయి

### 3. పదార్థ నైజం

అణువులు , వాటి మధ్య ఖాళీ జాగాలు, నిరంతరి భావన పదార్థం ( matter ) , ద్రవ్య రాశి (mass) ని కలిగి ఉంటుంది. ద్రవ్యరాశి వలన దానికి బరువు, జడత్వం (inertia ) ఏర్పడతాయి. ద్రవ్యరాశిని గ్రాము లలో కొలుస్తారు. కిలో గ్రాము అంతర్జాతీయ కొలమానం.(ఒక కిలోగ్రాము ద్రవ్యరాశి యొక్క బరువు 9.81 న్యూటన్లు. 1 న్యూటన్ బలం ఒక చదరపు మీటరు పై 1 పాస్కల్ ఒత్తిడి కలిగిస్తుంది. )





మనం రసాయన శాస్త్రం లో ఎక్కువగా అణువు ( molecule) ల గురించి చెప్పుకుంటాం . ఒక అణువుయొక్క కేంద్రం ( nucleus) లో కొన్ని తటస్థ విద్యుత్ కణాలు ( తవిణాలు, neutrons ) కొన్ని ధన విద్యుత్ కణాలు ( ధవిణాలు ,protons ) ఉంటాయి. ఇంగ్లీష్ లో ని "on' తెలుగు లో 'ణ ' అయిందని గుర్తించాలి. ఆ కేంద్రం చుట్టూ, కేంద్రం లో ఎన్ని ధవిణాలు ఉన్నాయో అన్ని ఋణ విద్యుత్ కణాలు ( ఋవిణాలు,electrons), దూరంగా తిరుగుతూ ఉంటాయి. అంటే అణువులో రిక్తం ఉంటుంది . అంత రిక్తం అన్న మాట మనకి అలవాటు అయినదే. ఖాళి జాగాని రిక్త స్థలం అనకుండా , రిక్తం అంటున్నాను. సుక్ష్మ విశ్వం లో పదార్థం కంటే ఖాళీయే ఎక్కువ ! ధవిణం యొక్క ద్రవ్య రాశి, ఋవిణం యొక్క ద్రవ్య రాశికి కంటే ఎన్నో రెట్లు హెచ్చు. అందుకని సాధారణం ఋవిణం ద్రవ్యరాశిని గణన లోకి తీసుకోము.

మనం పదార్థాల గురించి స్థూలం గా మాట్లాడేటప్పుడు అణువులు ఒక దానికి ఒకటి ఆనుకుని ఎడతెగక, ఖాళీలు లేకుండా ఉన్నట్టు అంటే నిరంతరం గా

ఉన్నట్టి, నమూనాని వాడుతూ ఉంటాము. ఆ నమునా వాడినప్పుడు ఆ పదార్థాన్ని ఇంగ్లీష్ లో Continuum అంటాం. మనం దాన్ని నిరంతరి అనవచ్చు. యదార్థానికి ఏ పదార్థం నిరంతరి కాదు. అణువుల లోపలేకాక, అణువుల మధ్య కుడా రిక్షములు ఉంటాయి. అసలు స్థూల, సుక్ష్మ విశ్వాలలో పదార్థం కంటే ఖాళీ జాగాలే ఎక్కువ .




**మూడు పదార్థ స్థితులు**

పదార్థం మూడు స్థితుల్లో ఉంటుంది. ఈ మూడు స్థితులు, అణువుల కదలికని అనుసరించి ఉంటాయి. అణువులు దగ్గరగా కుదింపబడి, కదలడానికి అతి తక్కువ వెసులు బాటు ఉన్న స్థితి మొదటిది. దీన్ని ఘన స్థితి అంటాం. మంచు గడ్డ ఈ స్థితికి చెందినది. ఘనస్థితిలో ఉన్నవాటిని తగినంతగా వేడి చేస్తే కరిగి ప్రవహిస్తాయి. వీటిని ప్రవాహిలు ( fluids ) అంటాం. ప్రవాహిలు రెండు స్థితులలో ఉంటాయి. వీటిని రెండో స్థితి, మూడో స్థితి గా గుర్తిస్తారు. అవి ద్రవ, వాయు స్థితులు. ద్రవ స్థితి లో ద్రవ్యరాశిని బట్టి, దాని ఘన పరిమాణం ఆధారపడి ఉంటుంది. దాని ఆకారం, దానికి ఆధారంగా ఉన్న పాత్ర ఆకారానికి అనుగుణంగా ఉంటుంది. దాని పైపైపు న నియంత్రణ లేని పరిస్థితుల్లో, తన ఉపరి తలాన్ని అదే స్వేచ్ఛగా ఏర్పరుచుకుంటుంది. అటువంటి ఉపరితలాన్ని ఇంగ్లీష్ లో free surface అంటాము. వాయు స్థితి లో ఒక ఆవరణలో బంధింప బడి ఉండకపోతే వాయువుకి ద్రవ్య రాశిని బట్టి ఒక ఘన పరిమాణం అన్నది ఉండదు . అది అవకాశం ఉన్నమేరకు వ్యాపిస్తుంది. ఉదాహరణకి ఒక ఘనపు మీటర్ కి సాధారణ పు రాళ్ళ ద్రవ్యరాశి, 29 00 కిలోగ్రాములు ఉంటె నీటి ద్రవ్యరాశి 1 000 కి.గ్రా, మనం పీల్చే గాలి ద్రవ్యరాశి 1.2 కి.గ్రా . ఉంటాయి .

పైన చూపిన పటంలో ఒక చిన్న ఆవరణలోని అణువులని ఎన్నో రెట్లు పెద్దవిగా చేసి చూపడం అయింది. మూడు స్థితుల లోని అణువుల అమరికలను ఆ పటం లో చూడవచ్చు . ఘన స్థితి లో అణువులు దగ్గరగా కూరుకొని ఉంటాయి. ఒక క్రమపద్ధతిలో అల్లిక కలిగి ఉంటాయి. కదలటానికి స్వేచ్ఛలేక కలిసి కంపిస్తూ ఉంటాయి.

ద్రవ స్థితి లో అణువులు దగ్గరగా కూరుకొని ఉంటాయి. కాని ఒక క్రమబద్ధమైన అల్లిక ఉండదు. ఒక దానినుంచి మరొకటి దూరం మార్చుకుంటూ కదలగలవు .

వాయు స్థితిలో అణువులు ఏ క్రమం లేకుండా ఒకదానికి ఒకటి చాలా దూరంగా, తీరు తెన్ను లేకుండా స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటాయి.

**స్థితి మార్పు లు**

ఒక ఘన పదార్థాన్ని వేడి చేస్తూ పోయిన స్థితిలో కలిగే మార్పుల్ని 2 వ పటం చూపిస్తుంది కొంత వరకు ఉష్ణోగ్రత పెరిగాక కరగటం మొదలు అవుతుంది. ఉష్ణ శక్తి ఇవ్వటం వలన అణువుల కదలిక పెరుగుతుంది. అణువుల కదలిక యొక్క సూచికనే ఉష్ణోగ్రత అంటాము. దీన్ని సాధారణంగా దారం లాంటి పాదరసపు సన్నని స్థంభం యొక్క వ్యాకోచం ద్వారా కొలుస్తాము.

కరగటం మొదలైనప్పుడు ఉష్ణోగ్రత పెరగటం ఆగిపోయి, అణువుల అల్లికని పట్టి ఉంచుతున్న బలాలని అధిగమించటానికి ఉష్ణ శక్తి ఖర్చు అవుతుంది. అల్లిక కొంత చెడ్డాక కరగటం

పూర్తి అయి , ఇంకా ఉష్ణ శక్తిని అందిస్తూ పోతే, లభించిన స్వేచ్ఛతో అణువులు వేగాన్ని పెంచుకోవటం మొదలు అవుతుంది. అంటే ఉష్ణోగ్రత పెరుగుతుంది. మరి కొంతసేపటికి ఉష్ణ శక్తి మిగిలిన అల్లికను ధ్వంసం చేసే పనిలోపడి ఖర్చు అవుతూ పోతుంది. దీన్ని మరుగుట అంటాము .

ద్రవ పదార్థం వాయురూపం పొందటం మొదలు అవుతుంది. మరుగుతున్నంతసేపు ఉష్ణోగ్రత పెరగదు. మరగటం పూర్తి అయ్యాక ఇంకా ఉష్ణశక్తిని అందిస్తూ పోతే వాయు రూపం లోని పదార్థం యొక్క ఉష్ణోగ్రత పెరుగుతూ పోతుంది.

అణువుల అల్లికను ధ్వంసం చేయటంలో వినియుక్తం అయిన ఉష్ణ శక్తి, భౌతిక ప్రపంచంలో మరే పనికి ఉపయోగపడదు. అణువుల వేగశక్తిని తగ్గించి మరో పనికి వాడుకోవచ్చు. యంతరపి (entropy) అనే భావం దీనికి-సంబంధించినదే .

మరిగే స్థితి కి ముందు కుడా ద్రవ అణువులు పైన గాలి లోకి వెళ్ళక పోవు. ఆ విధంగా వెళ్ళిన ద్రవ అణు సమూహాలు కొన్ని సార్లు మనకి బిందు రూపం లో కనిపిస్తూ ఉంటాయి. వాయు రూపానికి చెందని అణువుల సమూహాన్ని భాష్పం( vapor) అనటం ఒక ఆనువాయితి. ఈ భావాన్ని మనసులో ఉంచుకుంటే ఈ తేడాని మరోలా చెప్పవచ్చు. మరిగే ఉష్ణోగ్రత, కంటే హెచ్చు ఉష్ణోగ్రతల వద్ద దూర దూరంగా ఉన్న పదార్థపు అణువులని వాయు స్థితిలో ఉన్న అణువులని ఆ మరిగే ఉష్ణోగ్రత కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద, దూర దూరంగా ఉన్న పదార్థపు అణువులని భాష్పాలని అంటామన్నమాట .

మూడు స్థితుల్లో ఉన్న పదార్థ అణువు లన్నీ కుడా రసాయనికం గా తేడాలేనివే. వాటి కదలికల లోనే తేడా !

**పాక్షిక, సంతృప్త ప్రేషణలు, మరిగే స్థితి**

గాలిలో ఆమ్లజనీ, నత్రజని, ఉదజని, కర్బన ద్వి ఆమ్లజని (బొగ్గుపులుసువాయువు carbon dioxide) మొదలైన వాయువులు, నీటి భాష్పాలు లాంటి భాష్పాలు ఉంటాయి. ఇవన్ని వేటికవే విడిగా పాక్షిక ఒత్తిడు లని కలిగిస్తాయి. ఆ పాక్షిక ఒత్తిడుల మొత్తపు ఒత్తిడిని, గాలి ప్రేషణం (atmospheric pressure ) అంటారు. Pressure అన్న మాటకి నొక్కుడు, ఒత్తిడి, పీడన అని అశ్రద్ధగా వాడ తాము కాని ఈ రెండు మాటలు compression అనే బలాన్ని సూచించటానికి వాడటం సరైనది అని నేను అనుకుంటాను. ప్రేషణం అన్న మాట సరైనదే కాక ఉచ్చారణలో pressure కి దగ్గరగా ఉండే మాట .

గాలి ప్రేషణం రమారమి 10 ^5 ( లక్ష) పాస్కల్ లు ఉంటుంది. ఒక ఉష్ణోగ్రత వద్ద ఉన్న భాష్ప ప్రేషణం ఒక గరిష్ఠ స్థాయి( పరిమితి )కి లోబడి ఉంటుంది. ఆ గరిష్ఠ పరిమితి వద్ద ఉన్న భాష్ప ప్రేషణాన్ని సంతృప్త భాష్ప ప్రేషణం (saturated Vapor Pressure) అంటాము. ఈ సంతృప్త భాష్ప ప్రేషణం ఉష్ణోగ్రతతో పెరుగుతూ పోయి ఒక విలువ వద్ద, గాలి ప్రేషణంకి సమానమై, ద్రవం మరగటం మొదలు అవుతుంది

మనం ఒక ద్రవాన్ని వేడి చేసినప్పుడు, ద్రవ అణువులు పుంజుకున్న వేగంతో స్వేఛ్ఛా తలాన్ని అధిగమించి గాలిలోకి చొచ్చుకు పోతాయి అలా పోయేటప్పుడు స్వేఛ్ఛాతలం పై అంతకు ముందున్న వేరే వాయువుల అణువుల స్థానాన్ని ఆక్రమిస్తాయి. మరి గే ఉష్ణోగ్రత వద్ద స్వేఛ్ఛాతలం పై ఆవరణ అంతా ద్రవ అణువులతో నిండి పోతుంది. స్వేఛ్ఛా తలం పై వేరే వాయువుల అణువులు ఏవి లేక ద్రవ అణువుల సంతృప్త భాష్ప ప్రేషణమే మొత్తం ప్రేషణం అవుతుంది. అది స్థానికంగా ఉన్న గాలి ప్రేషణానికి సమంగా ఉంటుంది అటువంటి స్థితిని మరగటం అంటాం అంటాము.

(ఇంకా వుంది)

# నండూరి సరోజాదేవి




సీరియల్

## మిస్ మేఘమాల IAS




(గత సంచిక తరువాయి)

"అయినా, మేము ఇద్దరం ఒక్కలాగే వుంటాం కనుక, ఎవ్వరు తేడా తెలుసుకోలేకపోవచ్చు" అని నవ్వుతూ మేఘమాల బలవంతాన.. మాలతిని, తన కుర్చీలో కూర్చోపెట్టింది.

అంతే కాదు! మేఘమాల ఆ కుర్చీ చేతిమీద ఆని కూర్చుని, మాలతి భుజం చుట్టూ ఎడం చేతిని వేసి పట్టుకుని.. తన సెల్ ఫోన్తో, వినోద్ ని ఒక ఫోటో తీయమంది. తర్వాత వినోదుని, మాలతినీ పక్క పక్కన నిలబెట్టి.. తనూ వాళ్ళ పక్కన నిల్చుని ఒక సెల్ఫీ ఫోటోని కూడా తీసింది!

ఆ ఫోటోలు చూసుకున్న మాలతికి ఆనందంతో మొహం ఇంతయ్యి, మేఘమాలని ఒక్కసారి గట్టిగా కౌగలించేసుకుంది!

దాంతో మేఘమాల కూడా, మాలతి వీపుని ఆప్యాయంగా నిమిరి..తిరిగి తనని ఆ కుర్చీలో కూర్చోమంది!

"అన్నట్టు, వినోద్! మీ కోసం తెప్పించాను" అంటూ రెండు సెల్ ఫోను బాక్సులు డ్రాయర్ లోంచి తీసి, వాళ్ళిద్దరి చేతులకి చెరొకటి ఇచ్చింది మేఘమాల.

"అయ్యో! నువ్వెందుకు కొన్నావ్ మేఘమాలా? నేను తర్వాత తీసుకునే వాడిని కదా?"అన్నాడు వినోద్ కాస్త గట్టిగా.

"ఏం,నేను కొంటే తప్పా? నా వాళ్ళ కోసం ఇలా ఏంచేసినా నాకెంత సంతోషం అనిపిస్తుందో తెలుసా?"లో గొంతుకుతో అంది మేఘమాల.

"ఛ,ఛా! నా ఉద్దేశ్యం అది కాదు, నువ్వేం ఫీలు కాకు!" అంటూ చనువు తీసుకుని, మేఘమాల భుజం తట్టాడు వినోదు.

"పర్వాలేదులే"అని మేఘమాల కూడా వెంటనే అంది.

"మాలతీ! మనం ఇంక వెడదామా?మేఘమాలకి మీటింగ్ టైము అవుతుందేమో?"భార్యతో అన్నాడు వినోదు.

"అలాగే" అంటూ మాలతి కుర్చీలోంచి లేచింది!

"వినోద్! అదేదో నేను చూసుకుంటాను కానీ, మీరు ఒక గంట వెయిట్ చేస్తే .. ఒకసారి షాపింగ్ చూసుకుని, ఇంటికి వెడదాము" అని చెప్పింది మేఘమాల.

"షాపింగ్ కి ఎందుకు,నువ్వు ఏమైనా తీసుకోవాలా?" అడిగింది మాలతి.

"నాక్కాదు, మీకు కొనడానికే!"

"ఇవి కొన్నావు కదా,ఇంక మరేం వద్దులే!" మొహమాటంగా అంది మాలతి.

"అది, నాకొదిలి పెట్టేయమ్మ మాలతీ!" అని నవ్వుతూ చెప్పి..

"ఏమంటావ్ వినోద్, ఉంటారా?" అని అడిగిందామె

"ఉంటాములే, నువ్వెళ్ళి రా!" అన్నాడు వినోద్.

మేఘమాల ఇంట్రకామ్ బెల్ నొక్కగానే..అటెండర్ ఒకతను ఆ రూమ్ లోకి వెంటనే వచ్చాడు! అదేకాక! అచ్చుగుద్దినట్టు "తమ కలక్టరు గారు, అక్కడే ఉన్న ఇంకొకామె కూడా ఒకే పోలికలో ఉండడం గమనించిన" అతను ఆశ్చర్యంతో ఒక నిముషం పాటు వాళ్ళిద్దరినీ మార్చి మార్చి చూస్తూ ఉండిపోయాడు.

అతని పరిస్థితి గ్రహించిన మేఘమాల చిన్నగా నవ్వుకుంటూ.."మేము ఇద్దరం కవల పిల్లలంలే, అందుకే అలా ఒకే పోలిక కలిగి ఉన్నాము!" అంటూ ఆ అటెండర్ కి అర్ధమయ్యేటట్టు చెప్పింది.

"అవునా,మేడం?" అంటూ, అతను అప్పటికి తేరుకున్నాడు.

"ఓకే, వాసూ! ఇంక ఇది విను.. వీరికి తినడానికి స్నాక్స్ ఏం కావాలో కనుక్కునీ తెప్పించు" అని అతనికి చెప్పేసి..తన బ్యాగ్ లోంచి ఒక రెండు వందల రూపాయిల నోటు తీసి ఇచ్చింది.

"వినోద్! నువ్వూ, మాలతీ ఈ పక్క రెస్ట్ రూమ్లో కాసేపు రిలాక్స్ అవ్వండి.. అలాగే, ఏ మొహమాటం పడకుండా స్నాక్స్ ఏమైనా తెప్పించుకోండి. నేను మీటింగ్ కి అటెండ్ అయ్యి వచ్చేస్తాను" అంటూ మేఘమాల అక్కడ నుండి వెళ్ళిపోయింది.

"సార్! మీకు ఏం తెప్పించమంటారూ?"అటెండర్, వినోద్ ని ఎంతో వినమ్రతతో అడిగాడు.

"మాలతీ! నీకు ఏం కావాలీ?" వినోద్ అడిగాడు నవ్వుతూ.

"నీ ఇష్టం" మాలతి కూడా చిరునవ్వుతో చెప్పింది!

"సరే! "సమోసాలు, గుడ్ డే బిస్కట్ పేకెట్ ఒకటీ, కాఫీ తెమ్మనండి చాలు" అని చెప్పాడు వినోద్ అతనితో.

"అలాగే,సార్!"అంటూ అటెండర్ ఆ రూమ్ నుండి వెళ్ళిపోయాడు.

"రా,వెళ్ళి ఆ గదిలో కూర్చుందాం!" అంటూ వినోద్ భార్యతో ఆ రెస్ట్ రూమ్ లోకి వెళ్ళాడు.

అక్కడంతా చాలా నీట్ గా అనిపించింది. గది మొత్తం కార్పెట్ పరచబడి ఉండి, దాని మీద సోఫా సెట్టు, ఒక పక్కగా సింగిల్ మంచం ఉన్నాయి. ఆ రూమ్ కి అటాచుడుగా బాత్ రూమ్ కూడా ఉంది!

మేఘమాల, ఎప్పుడైనా పని ఒత్తిడి ఎక్కువగా అనిపిస్తే.. కాసేపు అక్కడ రెస్టు తీసుకుంటూ వుంటుంది! వినోద్ వెంటనే వెళ్ళి, పెద్ద సోఫాలో అడ్డంగా వాలిపోయాడు!

"ఆ పడుకునేది ఏదో, వెళ్ళి మంచం మీదే పడుకోవచ్చుగా?" మాలతి భర్తకి నవ్వుతు చెప్పి.. తానూ వెళ్ళి సోఫాలో కూర్చుని, మధ్యలో ఉన్న టీపాయి మీద కాళ్ళు జాపుకుంది!

"వద్దులే. అలా అక్కడ పడుకుంటే, ఎవరైనా వచ్చి చూస్తే బాగుండదు!" భార్యతో అన్నాడతను.

"అసలు ఆ ఆఫీసు రూమ్ లోకే, డోరు కొట్టందే ఎవ్వరూ లోపలికే రావటం లేదూ.. ఇంక ఇందులోకి ఇంకెవరు రాగలుగుతారు లెండీ?" అంది మాలతి.

"అబ్బో! ఉన్న ఈ కాసేపట్లో, అన్నింటినీ బాగానే గమనించేసినట్టున్నావే?" అని వినోద్ నవ్వుతు అంటూనే..

"మాలతీ! ఇక్కడికి వచ్చినందుకు నీకు హ్యాపీగా ఉందా? నీ కోరిక తీరిందా?" అనంటూ లేచి కూర్చుని, భార్య మొహంలోకి చూస్తూ మరీ అడిగాడు వినోదు.

"నిజంగా చాలా చాలా సంతోషంగా ఉన్నాను. మీరు చెప్పినట్టు, నాకిష్టమైన కలెక్టర్ చదువుని చదువుకోలేక పోయినా..మేఘమాల కలెక్టర్ అవ్వడంతో, ఆ ఉద్యోగం నేను చేస్తున్నట్టుగానే నాకనిపిస్తోంది! అంతేకాదు! నా మనస్సు గ్రహించీ,ఈ రోజు ఇలా ఇక్కడికి తీసుకు వచ్చినందుకు మాత్రం మీకు ఎంతో థాంక్స్ కూడా" అని మనస్ఫూర్తిగా చెప్తూ..... సోఫా లోంచి చటుక్కున లేచి భర్త పక్కన కూర్చుండిపోయి, అతని భుజం మీద ప్రేమగా తలవాల్చుకుంది మాలతి.

(ఇంకా వుంది)

# తుమ్మూరి రాంమోహన్ రావు



## సమ్మక్క సారలక్క జాతర

మేడారం జాతర లేదా సమ్మక్క జాతర తెలంగాణాలోనే కాదు యావద్భారత దేశంలోనే అతి పెద్ద ఆదివాసీల జాతర.దాన్నే సమ్మక్క సారలక్క జాతర అని అంటారు. వరంగల్ కు వంద కిలోమీటర్ల దూరంలో, ఏటూరు నాగారం ప్రాంతం మేడారంలో ప్రతి రెండేళ్లకోసారి జరుగుతాయి. మేడారం ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలంలో ఉంది. ఇది గిరి జనుల పర్వమైనా ఇప్పుడు బహుజనుల పండుగైంది. తమ కోర్కెలు తీరుస్తుందని తెలంగాణా ప్రజలేగాక ఇరుగు పొరుగు రాష్ట్రాలనుండి కోట్లాది భక్తులు వస్తారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పండుగకు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉన్నది. ఈ సంవత్సరం జనవరి 31 నుండి ఫిబ్రవరి 3 వరకు జరుగుతాయి.

పదమూడవ శతాబ్దంలో జరిగిన చారిత్రిక ఘటన ఈ పండుగకు మూలం. అప్పట్లో మేడారం ప్రాంతమంతా దట్టమైన అడవి ప్రాంతం. దండకారణ్యంలో భాగం. అది కాకతీయులు పరిపాలించే సమయం. ఆ అరణ్య ప్రాంతంలో నివసించే గిరిజన నాయకుడు, తేజస్సుతో వెలిగి పోయే బాలికను పులుల మధ్య ఆడుకుంటూ ఉండటం చూసి దైవాంశ సంభూతురాలిగా తలంచి చేరదీస్తాడు. పెరిగి పెద్దైన తరువాత పగిడిద్దరాజుకిచ్చి పెళ్లి చేస్తాడు నాయకుడు. వారికి ముగ్గురుసంతానం.సారక్క,జంపన్న.

కాకతీయరాజుల సైనిక వర్గంలోని కొందరు గిరిజనుల మీదికి దండెత్తి అఘాయిత్యం చేస్తారు. గిరిజనులకు సైనికులకు జరిగిన పోరాటంలో పగడిద్దరాజు చనిపోతాడు. అప్పుడు సమ్మక్క ధైర్య సాహసాలతో కదనరంగంలోకి దూకుతుంది. ఆమెకూతురు సారలమ్మ కొడుకు జంపన్న కూడా యుద్ధరంగలోకి హతులౌతారు. సమ్మక్క కూడా మరణిస్తుంది.

ఆమెను దేవతగా భావించే గిరిజనులు ఆమె మహిమాన్వితురాలనీ, ఆమె కోరిన కోర్కెలు తీర్చే తల్లియనీ నమ్ముతారు. అక్కడ బెల్లం ముద్దలు సమర్పించుకొని తమ కష్టాలు గట్టెక్కాలని మొక్కుంటారు. అది గిరి జనుల నుండి ఇతర కులాల వారికి కూడా పాకింది. అలా అలా అది ఈనాడొక అంతర్జాతీయ స్థాయికి చేరింది. ఆ దగ్గరలోనే గోదావరికి ఉపనదియైన జంపన్నవాగు ఉన్నది. అందులోని నీరు ఎర్రగా ఉంటుంది

అయితే జంపన్న పోరులో మరణించినపుడు అతని రక్తంతో కలిసి పోవడం వల్లనే ఆ నీళ్ళు ఎర్రగా మారినాయని వాళ్లనమ్మకం. ఒకరకంగా ఈ జాతర వీరపూజ. ఏదైతేనేం, ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న పండుగ.



# శ్రీనాధుని కాశీ ఖండం

## (వచనానుసరణం)



పోచినపెద్ది మురళీ కృష్ణ

### ముందు మాట

కాశీ క్షేత్రంతో భారతీయులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది.. జన్మించినా, మరణించినా కాశీ క్షేత్రంలోనే జరగాలని భారతీయులు భావిస్తారు. అంతటి పవిత్ర క్షేత్ర వైభవాన్ని వర్ణించని భారతీయ సాహిత్యం లేదు. స్కాంద పురాణంలో వ్యాసుడు కాశీ వైభవాన్ని విస్తృతంగా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో శ్రీనాధుడు ప్రప్రధమంగా ప్రబంధ రీతిలో కాశీ క్షేత్రాన్ని వర్ణించాడు. ఈ కాశీ ఖండాన్ని మా పాఠకులకు పరిచయం చేయడానికి డా. పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారిచే సరళ వ్యావహారిక భాషలో, యధా మూలానుసారంగా అనుసరించిన కాశీ ఖండాన్ని, నెలనెలా అందిస్తున్నాము.

ఈ వ్యాస పరంపర ఆధ్యాత్మిక వేత్తలకు భక్తి తత్వాన్ని, విద్యార్థులకు శ్రీనాధుని తత్వాన్ని అందించగలదని భావిస్తున్నాము.

- సంపాదకురాలు.

(గత సంచిక తరువాయి)

పరమేశ్వరుడు చిరునవ్వు నవ్వుతూ రాక్షస సేనపై త్రిశూలాన్ని విసిరాడు. కోటి సూర్య సమానమైన తేజస్సుగల ఆ త్రిశూలము గజాసురుని గుండెలో గుచ్చుకుంది. గజాసురుని శరీరమునుండి రక్తము కారుతోంది. ఆ రక్తముతోపాటు గజాసురుని పాపాలుకూడా నశించి పోయాయి. నిర్మలమైన మనస్సు కలవాడై గజాశురుడు శివుని ప్రార్థించాడు. అతని ప్రార్థనను మన్నించినవాడై పరమేశ్వరుడు వరాన్ని కోరుకొమ్మని గజాసురుని ఆదేశించాడు. “ ఓ! విశ్వేశ్వరా! పుట్టినవాడు గిట్టకమానడు. సమస్తమైన సృష్టికి నీవు పట్టాభిషిక్తుడవు. సకలదేవతలు నీ పాదాలకు నమస్కరిస్తున్నారు. కృపా సముద్రుడవైన నిన్ను కట్టకడపట చూడగలిగాను. నీ త్రిశూలంతో నా చర్మాని ఒలిచి వస్త్రంగా ధరించాలి. పరమేశ్వరా! నాపై నీకు అనురాగము ఉన్నట్లయిన నా చర్మము వాసన లేకుండా, చినిగి పోకుండా, వెండి కొండపై నల్ల మబ్బులాగ నీ శరీరంపై ఎల్లకాలం ఉండాలి. ఈ ఒక్క కోరికను తీర్చు” అని గజాసురుడు ప్రార్థించాడు. పరమేశ్వరుడు గజాసురుని కోరికను మన్నించి అతనిని సంహరించి చర్మాన్ని ఒలిచి ధరించాడు. ఆనాటినుండి పరమేశ్వరుడు కృత్తివాసుడు అని పిలవబడు తున్నాడు. అక్కడ కృత్తివాస తీర్థము ఏర్పడినది. ఆ తీర్థాన్ని సేవించినట్లయిన సంసారము అను విషము నశించి పోతుంది.

**కలహంస తీర్థాది మహాత్మ్యము.**

ఒకరోజున కాశీ క్షేత్రంలో రెండు కాకులు పోట్లాడుకుంటూ ఒక సరస్సులో పడ్డాయి. వెంటనే ఆ కాకులు హంసలులాగ మారిపోయాయి. ఆ నాటినుండి ఆ తీర్థాన్ని “ కలహంస తీర్థ మని” పిలుస్తున్నారు. కలహంస తీర్థానికి దగ్గరలో అన్ని దిక్కులవైపుకి పదివేల మూడు వందల శివలింగాలు ప్రతిష్ఠించబడి ఉన్నాయి.

ఆ శివలింగాలు వరుసగా లోమేశ్వర లింగం, మాలతీశ్వర లింగం, నంతకేశ్వర లింగం, జన-



కేశ్వర లింగం, బసితాంగ భైరవలింగం, శుష్కోదర తీర్థం, అగ్ని జిహ్వా మణి కుండ మహాబల లింగం, శశి భూషణ లింగం, మహాకాళ, యోగదేవేశ్వర, మహానాద తీర్థంబులును, విమలేశ్వర లింగం, మహా దేవలింగం, పితా మహేశ్వర లింగం, రుద్రస్థలీతీర్థం, చండీశ్వర, నీలకంఠేశ్వర విజయేయేశ్వర, శ్రీకంఠేశ్వర, కపర్దీశ్వర, యక్షేశ్వర, జయంతేశ్వర, త్రిపురాంతక, కుక్కుటేశ్వర, త్ర్యంబక, హరిశ్చంద్రేశ్వర, చతుర్వేదేశ్వర, సహస్రాక్షేశ్వర, ఈశానేశ్వర, సంహారభైరవ స్థానోగ్ర భవేశ్వర, ఢుంఠీశ్వర, భద్రకర్ణేశ్వర, కాలకలశేశ్వర, కామేశ్వర లింగంబులును, గణపతి క్షేత్రంబును, మత్స్యోదరీ తీర్థం, భూర్భువస్స్వర్లింగం, హాటకేశ్వర, కిరాతేశ్వర, భార భూతేశ్వర, నాకులేశ్వర, నైరుతేశ్వర, జలప్రియ, జ్యేష్ఠేశ్వర, దేవేశ్వర, ఓంకారేశ్వర, ప్రాసాదపర్వత లింగాలు మొత్తం అరవై ఎనిమిది లింగాలు ఉన్నాయి.

**శక్తి ప్రకరణము.**

కాశీ నగరం శివుని అర్ధాంగి అయిన పార్వతీదేవి చేతను, లేత చిగురాకులవలె ఎఱ్ఱని శరీరము కలిగి, నిత్య యౌవ్వనము కలదియు, ఎల్ల లోకములకు తల్లి అయిన లలితా దేవిచేతను, పూవు వంటి శరీరము కలదియు, హ్రీంకారము అనెడి పద్మ వనమునందు సంచరించునదియు, హంసియైన విశ్వభుజాదేవిచేతను, పశ్చిమనాడీ వీధియందు పరమ యోగీశ్వరులు దర్శించునటువంటి శివదూతి చేతను, నీలకుంతలయైన చిత్రఘంటా దేవి చేతను, రాక్షసులకు భయము కలిగించు భద్రకాళి చేతను, కృపకు విధేయురాలైన నిగళ భంజనాదేవి చేతను రక్షించ బడుతోంది. కుబ్జ మహా దేవియు, మహాలక్ష్మియు, కాశీ నగరానికి గ్రామదేవతలు.

కాశీ నగరంలోని రాజ వీధియందు ఇంద్రాణి ఐరావతమును ఎక్కి తిరుగుతూ ఉంటుంది. శృంగార వనవీధియందు కొదమ నెమలినెక్కి కౌమారి విహరిస్తూ ఉంటుంది, మాహేశ్వరి వృషభానెక్కి వ్యాళికి వెడుతూ ఉంటుంది. బ్రాహ్మీ దేవి రాజహంస నెక్కి విహరిస్తుంది, వైష్ణవి గరుత్మంతుని ఎక్కి తిరుగుతుంది. వారాహి, చాముండి తమ వాహనాలను ఎక్కి అహరహము సంచరిస్తూ ఉంటారు. కాశీ నగరంలో చిత్ర ఘంటాదేవిని సేవించినవారికి యముని వాహనముయొక్క ఘంటానాదమును వినరు[నరకానికి వెళ్ళరు].

రాక్షసులను సంహరించుటలో నేర్పరి, హ్రీంకారాక్షర సౌధశిఖర క్రీడా వినోదినియు, కాశికాపుర నివాశినియైన జాలేశ్వరీ దేవి తన భక్తుల విఘ్నాలను చూపుడు వేలు కొనతో పోగొడుతుంది. భద్ర నాగము అనే తీర్థానికి సమీపంలో ఉన్నభద్ర కాళికా దేవిని భద్రవాపికయందు స్నానంచేసి, సందర్శించుకొన్నవారికి శుభాలు కలుగుతాయి. సిద్ధి వినాయకునికి పక్కన ఉన్న వరసిద్ధి దేవిని మూడు సంధ్యలయందు సేవించిన వారికి వైభవములు, సంపదలు సిద్ధిస్తాయి. కాశీ నగరంలోని విధిశక్తి కపటము లేనిది, కృప కలది. ఆమెను విధీశ్వరుని సన్నిధిలో సేవించినవారికి సాటిలేని సిద్ధులు కలుగుతాయి. అమరేశ్వరీ దేవిని సేవించిన

వారు దీర్ఘాయుష్మంతులై, సంపదలతో వృద్ధి చెందుతారు.

శ్రీకంఠుని సన్నిధానమునందు లక్ష్మీ దేవిని సేవించిన వారికి భోగ మోక్షాలు కలుగుతాయి. లక్ష్మీ పీఠము సాధకుల అభీష్టము తీరుస్తుంది. లక్ష్మీ పీఠానికి ఉత్తర దిక్కులో "హయకంఠ" అనుశక్తి ఉంది. ఆమె తన చేతిలోని గొడ్డలితో విఘ్నాలను నరికి వేస్తుంది. పాశపాణికి దక్షిణ దిక్కునందు ఉన్న " కౌర్మి" అనుశక్తి త్రివిధ కర్మలను ఖండిస్తుంది. వాయువ్య భాగంలో ఉన్న " శిఖ దండి" అనుశక్తి ఆడు నెమలి రూపాన్ని ధరించి క్షణక్షణానికి కేకా ధ్వనులు చేస్తూ ఉంటుంది. భీమేశ్వరునికి ఎదురుగా పాశము, పద్మాన్ని ధరించి భద్రకాళి ఉంటుంది. భీమ కుండానికి పార్శ్వ భాగంలో భీమచండీ దేవి ఉంటుంది. వృషభధ్వజ లింగానికి దక్షిణ దిక్కులో భాగ వక్త్రేశ్వరీ దేవి ఉంది. ఆమె శివ సేవకుల విఘ్నాలను పోగొడుతుంది.

కాశీ నగరం పొలిమేరలో తాళ జంఘేశ్వరి అను శక్తి ఉంది. ఆమె వామ హస్తంలో తాడి చెట్టు కాండం ఉంటుంది. ఆమె భక్తుల విఘ్నాలను పోగొడుతూ ఉంటుంది. "వికటానన" అను దేవత బంగారు కిరీటాన్ని, హారాలు,భూషణాలు,కలిగి ఉంటుంది. తలపై చంద్ర బింబం ఉంటుంది. ఆమె కాశీ నగరాన్ని విడిచిపెట్టి ఉండదు. " ఉద్దాల-



కుడు" అను పేరుతో శివుడు ఒక చేతిలో మంచపుకోడు పట్టుకొని యముని మదాన్ని హరిస్తూ ఉద్దాలక తీర్థంలో ఉంటాడు. ఆ ఉద్దాలక తీర్థానికి తూర్పు దిక్కునందు " యమదంష్ట్రము" అను పేరుగల శక్తి తన చిరునవ్వులతో శివుని వలపిస్తూ ఉంటుంది. దారుకేశ్వర తీర్థంలో "దారుకేశ్వరుడు" అను పేరుతో పరమేశ్వరుడు ఉన్నాడు. ఆయన బ్రహ్మ విద్యానిధి. ఆయనను సేవించిన వారు ధన్యులలో ధన్యులు. దారుకేశ్వరుని పాదభూమియందు కాళ రాత్రి అను పేరుగల " శుష్కోదరి" అను శక్తి ఉంది. ఆమె రెండు తొడలు ఏడుతాడిచెట్లప్రమాణంలో ఉంటాయి. కదులుచున్న నాలుక, ఆకాశము వంటి పైపెదవి, భూమి వంటి క్రింది పెదవి, నక్షత్రాలు లాంటి పలువరసలు, నాగు కోరలు, ఉండి నోరు తెరుచుకొని బ్రహ్మాండాన్ని మింగడానికి చేయి సాచి ఉంటుంది. ఆమె చర్మముండాదేవికి చెలికత్తె.

చర్మ ముండాదేవి పులితోలును ధరిస్తుంది. ఎడమచేతిలో శూలం పట్టుకొని ఉంటుంది. నుదుటిపై త్రిపుండ్రాన్ని ధరిస్తుంది. నాగయజ్ఞోపవీతాన్ని ధరిస్తుంది. కంఠంపై ఎముకుల మాల ధరిస్తుంది. శరీరమంతా రక్త చందనాన్ని అలముకొంటుంది. ఏనుగు చెక్కిలిపై ఏర్పడిన మదజలాన్ని కాటుకగా ధరిస్తుంది. చర్మ ముండాదేవి ఉల్లాసంగా మహాశ్మశానంలో విహరిస్తూ ఉంటుంది. ఆమె చెలికత్తె అయిన మహారుండాదేవి చర్మ ముండా దేవి వలె ఉంటుంది. ఈమె కపాలమాల ధరించి ఉంటుంది.

(ఇంకావుంది)

పోడూరి శ్రీనివాసరావు



# భావకవిత్వ సార్వభౌమ శ్రీ దేవులపల్లి

(98494 22239)

భావకవిత్వానికి బ్రహ్మ.... రారాజు.... 'ఆంధ్రా షెల్లీ' అని కీర్తింపబడ్డ మహానుభావుడు... సాహిత్య సరస్వతికి అనుంగు ముద్దుబిడ్డ... కవితామూర్తి ... శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు.

ప్రసిద్ధ తెలుగు కవి, తెలుగు భావకవితా రంగంలో శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి ఒక ప్రముఖ అధ్యాయం. మరచిపోలేని, మరపురాని ఒక మధుర భావన. రేడియోలో లలితగీతాలు, నాటికలు, సినిమాల్లో పాటలు వ్రాయడం ద్వారా సాహితీవనంలో కృష్ణశాస్త్రి గారు సుగంధాలు పూయించారు.

1929 లో విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ ని కలిశాక శ్రీ కృష్ణశాస్త్రి గారి కవిత్వంలో భావుకత తొంగి చూడడమే కాక గుబాళించింది కూడా. 1945 లో ఆకాశవాణిలో చేరిన శ్రీ కృష్ణశాస్త్రి గారు అనేక పాటలు, నాటికలు రచించారు.

****************

తూర్పు గోదావరి జిల్లాలో పిఠాపురం దగ్గర గల 'రావువారి చంద్రపాలెం' గ్రామంలో, పండిత కుటుంబంలో 1897 వ సంవత్సరం నవంబర్ 1 వ తేదీన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు జన్మించారు. వారి తండ్రి, పెదతండ్రి గొప్ప పండితులు కావడంతో నిరంతరం వారింట్లో సాహిత్య గోష్ఠులు జరుగుతూ ఉండేవి. పిఠాపురం హైస్కూల్ లో కృష్ణశాస్త్రిగారి విద్యాభ్యాసం జరిగింది. శ్రీ శాస్త్రిగారు చిన్నతనం నుంచీ రచనలు చేసేవారు. పిఠాపురం హైస్కూల్ లో తన



గురువులు కూచి నరసింహం గారు, రఘుపతి వెంకటరత్నం గారు తనకు ఆంగ్లసాహిత్యంలో అభిరుచి కలిపించారని శ్రీ కృష్ణశాస్త్రి గారే స్వయంగా చెప్పుకున్నారు. 1915 లో విజయనగరం వెళ్లి డిగ్రీ పూర్తి చేసి, తిరిగి కాకినాడ పట్టణం చేరుకున్నారు.

తర్వాత పెద్దాపురంలో గల మిషన్ హైస్కూల్ లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు.

ఆ రోజుల్లో వ్యావహారిక భాషావాదం, బ్రహ్మసమాజం వంటి విషయాలపై ఉద్యమాలు ప్రబలంగా, ప్రముఖంగా జరుగుతుండేవి. శ్రీ కృష్ణశాస్త్రి గారు, తాను చేస్తున్న అధ్యాపక వృత్తిని వదిలిపెట్టి బ్రహ్మసమాజం వారు నిర్వహించే కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేవారు. అదే సమయంలో సాహితీవ్యాసంగం కూడా కొనసాగించేవారు. 1920

లో వైద్యం కోసం రైలులో బళ్ళారి వెళుతుండగా, ప్రకృతి నుంచి లభించిన ప్రేరణతో 'కృష్ణపక్షం' కావ్యం రూపుదిద్దుకుంది. 1922 వ సంవత్సరంలో జరిగిన విషాదం-భార్యా వియోగం తర్వాత శ్రీ కృష్ణశాస్త్రి గారి రచనలలో విషాదం పాలు అధికమైంది.

తర్వాత మళ్ళా వివాహం చేసుకున్న తర్వాత పిఠాపురం హైస్కూల్ లో అధ్యాపకునిగా చేరారు. శ్రీ కృష్ణశాస్త్రి గారు అప్పుడే 'రాజహంస' గారిని వివాహం చేసుకున్నారు. పిఠాపురం హైస్కూల్ లో అధ్యాపకునిగా అయితే పనిచేశారు గానీ, పిఠాపురం రాజావారికి కృష్ణశాస్త్రి గారి భావాలు నచ్చలేదు. దాంతో శ్రీ కృష్ణశాస్త్రిగారు, ఆ ఉద్యోగం వదిలి బ్రహ్మసమాజంలోనూ, నవ్య సాహితీ సమితిలోనూ, సభ్యునిగా... భావ కవిత్వోద్యమ ప్రవక్తకునిగా... దేశమంతటా ప్రచారంలో పాల్గొన్నారు. ఆ ప్రచార సమయంలోనే కృష్ణశాస్త్రి గారికి ఎందరో కవులతో, పండితులతో పరిచయం కలిగింది. అపుడే వారు ప్రాచ్య, పాస్చాత్య సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేశారు.

పిఠాపురంలోని హరిజన వసతి గృహంలో సంబంధం ఏర్పరుచుకుని, హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొనడంతో - వారి బంధువులు కృష్ణశాస్త్రి గారిని వెలివేశారు. అయినా వెనుకాడని కృష్ణశాస్త్రి గారు వేశ్యా వివాహ సంస్థను ఏర్పాటు చేసి, ఎందరో



జయ జయ జయ ప్రియ భారత
జనయిత్రీ దివ్యధాత్రి!
జయ జయ జయ శత సహస్ర
నరనారీ హృదయనేత్రి!

కళావంతులకు వివాహాలు జరిపించారు. ఆ సమయంలోనే, సంఘ సంస్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తూనే 'ఊర్వశి' అనే కావ్యం వ్రాసారు.

1929 వ సంవత్సరంలో విశ్వకవి శ్రీ రవీంద్రనాథ్ టాగోర్ తో పరిచయం ఏర్పడ్డాక వారిద్దరి మధ్యా సాహితీ సంబంధాలు, సాన్నిహిత్యం ఏర్పడ్డాయి. 1933 - 41 మధ్యకాలంలో కాకినాడలోని కాలేజ్ లో చేరి, తిరిగి అధ్యాపక వృత్తిని చేపట్టారు. 1957 వ సంవత్సరంలో ఆకాశవాణిలో చేరి, తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు తెలుగు శ్రోతలకు అందించారు.

భావకవిగా, 'ఆంధ్రా షెల్లీ' గా ప్రసిద్ధులైన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు, ప్రసిద్ధ దర్శకుడు శ్రీ బి. ఎన్. రెడ్డి గారి ప్రోత్సాహంతో 1951 వ సంవత్సరంలో 'మల్లీశ్వరి' చిత్రంతో, చలనచిత్ర రంగంలో అడుగుపెట్టారు.

'మల్లీశ్వరి' సినిమా అంత అఖండ విజయం సాధించిందంటే ... శ్రీ దేవులపల్లి వారి కలం నుంచి జాలువారిన అక్షరమాల... దానికి తోడు మహామహులయిన శ్రీ నందమూరి తారకరామారావు, భానుమతి గార్ల అభినయ కౌశలం ముఖ్య కారణాలు. సినిమా పాటకు కావ్యగౌరవం అందించడంతో బాటు, సాహితీ విలువలు పెంచారు. తానేమిటో తెలుగు ప్రేక్షకులకు, శ్రోతలకు, విమర్శకులకు తెలియజెప్పారు. భావ వ్యక్తీకరణ, సాహిత్య సంపద, పదలాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం కృష్ణశాస్త్రి గారి పాటల్లోని ప్రధాన లక్షణాలు.



భావోద్వేగాలకు, హృదయ స్పందనకు - అక్షర రూపాన్నిచ్చిన మహనీయుడు శ్రీ కృష్ణశాస్త్రి. ఆయన కలం నుంచి భావగీతాలే కాదు సుకుమార ప్రణయ విరహ గీతాలు, ఆత్మనివేదన, ఆరాధనతో కూడిన భక్తిగీతాలు కూడా జాలువారాయి. శ్రోతలను ఆనంద పరవశుల్ని చేశాయి. తొలి చిత్రమైన 'మల్లీశ్వరి' చిత్రంతోనే తెలుగు సినీ సాహిత్య గేయ రచనలో మకుటం లేని మహారాజుగా సాహితీ సార్వభౌమ స్థానాన్ని అధిరోహించారు.

తెలుగు సినీగేయ రచన అన్నది 1931 లో 'భక్త ప్రహ్లాద' చిత్రంతో ప్రారంభమయింది అనుకుంటే, సుమారు 2011 నాటికి, ఎనభై వసంతాల కాలంలో, సుమారు 400 కి పైగా కవులు దాదాపు 34 వేల పాటలను రచించారు. ఇందులో, 34 వేల పాటల్లో అనువాద గీతాల్ని గణనలోకి తీసుకోవడం జరగలేదు. ఇలా గీత రచయితలుగా పేరుమోసిన సుమారు 400 మంది కవులను జల్లెడ పడితే, తమ ప్రత్యేకతలతో, తమ శైలితో, ప్రాచుర్యం పొంది, తెలుగు సినిమా పాటకు దిశానిర్దేశం చేసిన కవులు 12 మంది కంటే ఎక్కువ ఉండరంటే అతిశయోక్తి కాదు. అటువంటి 12 మంది కవులలో కూడా ప్రత్యేక స్థానం సంపాదించుకోగలిగిన, శ్రోతల గుండెల్లో తిష్ఠ వేసికొని కూర్చుని, చెరగని ముద్ర వేసుకున్న తెలుగు సినీ గేయ రచయితల రారాజు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారంటే కాదనే తెలుగువాడుండడు అని నా అభిప్రాయం. పైన తెలిపిన విధంగా తెలుగు సినిమా పాటకు దిశానిర్దేశం చేసిన 12 మంది సినీగేయ రచయితల్లో, అతి తక్కువగా, కేవలం 170 పాటలను మాత్రమే వ్రాసినదెవరయ్యా అంటే ... శ్రీ కృష్ణశాస్త్రి గారే! ఆ నూట డెబ్బై పాటలు కూడా అజరామరాలే!! ప్రతీ పాటా ఆణిముత్యమే. 1951 లో విడుదలయిన మల్లీశ్వరి చిత్రంలోని పాటలు వింటుంటే నేటికీ కూడా శ్రోతల గుండెలు సవ్వడులతో ఉరకలు వేస్తూనే ఉంటాయి. 'నల్లని మబ్బులు గుంపులు గుంపులు... తెల్లని కొంగలు బారులు బారులు' అని భానుమతి గళంలో, ఘంటసాల మేష్టారి స్వరంలో పాట వినిపిస్తుంటే - నాగరాజు, మల్లీశ్వరి ఎడ్ల బండిమీద వెళ్తున్న ఆ దృశ్యం మన కళ్ళముందు కదలాడక మానదు. ఎక్కడ 1951, ఎక్కడ 2018? ఇప్పటికి 67 సంవత్సరాలయినా... ఆనాటి పాటలు ఇప్పటికీ జనరంజకంగా ఉన్నాయంటే ఆనాటి సాహిత్య విలువలు. తన తొలి చిత్రంతోనే అంత సుమధుర, సుమనోహర గీతాల్ని అందించిన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి కారణజన్ముడు కాదంటారా?

జయ జయ సస్యామల సు
శ్యామల చల చ్చేలాంచల!
జయ వసంత కుసుమ లతా
చలిత లలిత చూర్ణకుంతల!
జయ మదీయ హృదయాశయ
లాక్షారుణ పదయుగళా!
జయ జయ జయ........

గొప్ప వక్తగా, భావకవుల ప్రతినిధిగా పేరుపొందిన శ్రీ కృష్ణశాస్త్రిగారి గొంతు 1963 లో అనారోగ్యం కారణంగా మూగబోయింది. కానీ, శాస్త్రిగారి రచనలకు అదేమీ అవరోధం కాలేదు. వారి రచనా పరంపర కొనసాగుతూనే

జయ దిశాంత గత శకుంత
దివ్యగాన పరితోషణ!
జయ గాయక వైతాళిక
గళవిశాల పథ విహరణ!
జయ మదీయ మధుర గేయ
చుంభిత సుందర చరణా!
జయ జయ జయ........

వచ్చింది. అనేక సన్మానాలూ, ప్రశంసలూ కృష్ణశాస్త్రి గారి వశమయ్యాయి. 1980 ఫిబ్రవరి 24 వ తేదీన శ్రీ కృష్ణశాస్త్రి తన కవితా సౌరభాన్ని సురలోకవాసులకు అందజేయాలన్న తలంపుతో స్వర్గాని కేగారు.

వారు భౌతికంగా లేకపోయినా వారి గేయరచనా కౌశలం మనందరి చెవుల్లో, గుండెల్లో మారుమ్రోగుతూనే ఉంటుంది.

వారందుకున్న పురస్కారాలు - 1975 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారిచే కళాప్రపూర్ణ, 1976 లో పద్మభూషణ్, 1978 లో సాహిత్య అకాడమీ అవార్డులు.

శ్రీ కృష్ణశాస్త్రి గారి రచనలలో ముఖ్యమైనవి:

కృష్ణ పక్షము, ఊర్వశి కావ్యము, అమృతవీణ (గేయమాలిక), అమూల్యాభిప్రాయాలు (వ్యాసావళి), బహుకాల దర్శనం 9నాటికలు, కథలు), ధనుర్దాసు (భక్తి నాటికలు), కృష్ణశాస్త్రి వ్యాసావళి - 4 భాగాలు, మంగళకాహళి (దేశభక్తి గీతాలు), శర్మిష్ట (ఆరు శ్రవ్య రేడియోనాటికలు), శ్రీ ఆండాళ్ తిరుప్పావు కీర్తనలు, మేఘమాల (సినిమా పాటల సంకలనం), శ్రీ విద్యావతి (శృంగార నాటికలు), యక్షగానాలు - అతిథిశాల (సంగీత రూపకాలు), మహతి మొదలైనవి.

వారు రచించిన మనోహరమైన, మనసుకు హత్తుకునే పాటలు



గల కొన్ని సినిమాలు: మల్లీశ్వరి, మేఘసందేశం, గోరింటాకు, కార్తీకదీపం, రాజమకుటం, ఏకవీర, మాయని మమత, శ్రీరామ పట్టాభిషేకం, వాడే వీడు, బంగారు పంజరం, కళ్యాణమండపం, కలసిన మనసులు, బలిపీఠం, ఉండమ్మా బొట్టుపెడతా, అమాయకుడు, శ్రీ రాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్ , ఈనాటి బంధం ఏనాటిదో, జగత్ కిలాడీలు, చీకటి వెలుగులు, అమెరికా అమ్మాయి, సుఖదుఃఖాలు, సీతామాలక్ష్మి, మా బంగారక్క, అమ్మమాట, ఆనంద భైరవి, భక్త తుకారాం, రాముడే దేముడు, మొదలైనవి.

శ్రీ కృష్ణశాస్త్రి గురించి ప్రముఖ కవులు వెలిబుచ్చిన అభిప్రాయాలు:

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ: 'మనకు కీట్స్, షెల్లీ, వర్డ్స్ వర్త్ వంటి కవులు లేరు. ఆ కవులు మన దేశంలో శ్రీ కృష్ణశాస్త్రిగారిగా పుట్టినారని నా అభిప్రాయం'.

మహాకవి శ్రీ శ్రీ : 'నేను కృష్ణశాస్త్రి గారి కవితా శైలినే అనుకరించేవాడిని. కానీ, మా నారాయణబాబు కృష్ణశాస్త్రి సింహం జూలును కూడా అనుసరించి, దానిని రోజా సంపెంగ నూనెతో సంరక్షించుకునేవాడు. నాకెప్పుడూ పద్యం మీద ఉన్న శ్రద్ధ జుట్టు మీద ఉండేదికాదు'.

ఫిబ్రవరి 24 వ తేదీన దివికేగిన శ్రీ కృష్ణశాస్త్రిగారిపై, చైతన్యం సంకల్పబలం మాసపత్రిక ఫిబ్రవరి సంచికకు, ఈ వ్యాసం వ్రాయడం ఆయనకు నేనందించిన నివాళిగా భావిస్తున్నాను. ఇది నా అదృష్టం - యాదృచ్ఛికం.

# చిలకమర్తి దుర్గా ప్రసాదరావు





# SPOKEN SANSKRIT

+91 9897959425

## (సంభాషణ సంస్కృతం -14)

పాఠం -- Lesson-14

### Unit-1

अद्यतन (adyatana) (ఈనాటి) )—श्वस्तन (shvastana ) (రేపటి) – ह्यस्तन (నిన్నటి) (hyastana) —पूर्वतन (ప్రాచీనమైన) (purvatana) —इदानीन्तन (idaaneentana) (ఇప్పటి)

अद्यतन the period of a current day.(Of today)—श्वस्तन future (tomorrow's) ह्यस्तन (of yesterday)—पूर्वतन 0lden—इदानीन्तन present, momentary, of the present moment.

SOME EXAMPLES:

1. एष: अद्यतन: पाठ: — ఇది ఈనాటి పాఠము (This is today's lesson)
2. स: ह्यस्तन: पाठ: — అది నిన్నటి పాఠము (That is yesterday's lesson)
3. एष: श्वस्तन: पाठ: — ఇది రేపటి పాఠము (This is tomorrow's lesson)
4. एषा अद्यतना पत्रिका — ఇది నేటి పత్రిక (This is today's magazine)

1. सा ह्यस्तना पत्रिका — అది నిన్నటి పత్రిక ( That is yesterday's magazine)
2. एषा श्वस्तना पत्रिका — ఇది రేపటి పత్రిక ( This is tomorrow's magazine)
3. एतत् गृहं पूर्वतनम् — ఈ ఇల్లు పాతది ( This house is of ancient times)
4. अयं व्यवहार: इदानीन्तन: — ఈ వ్యవహారం ఇప్పటిది (This affair is of present times)

### Unit-2

गत x आगामि

गत= any thing past or done (జరిగిపోయిన )
आगामि= coming , future (రాబోయే ).

SOME EXAMPLES:

1. गतदिने अहं वैद्यस्य समीपं गतवान् || आगामिदिने शस्त्रचिकित्सा भविष्यति || **నిన్న నేను వైద్యుని దగ్గరకు వెళ్ళి-తిని . రేపు ఆపరేషను జరుగును .**

**I went to the doctor yesterday. Operation will be held tomorrow.**

2. अहं गतमासे ' चेन्नै ' नगरे आसम् || आगामिमासे अहं 'मुम्बै' नगरं गमिष्यामि|| **గత నెల నేను చెన్నైలో ఉంటిని. రాబోయే నెలలో నేను ముంబైలో ఉందును. I was there in Chennai last month. I will go to Mumbai next month.**

3. गतदिने वर्ष: अधिक: आसीत् || अत: आगामिदिनपर्यन्तं पाठशालाया: विराम: प्रकटित: || **నిన్న వాన బాగా కురిసింది . అందువల్ల రేపటివరకు పాఠశాలకు సెలవు ప్రకటింప బడింది . .**

**There was heavy rain yesterday. Therefore it is announced to close the school till tomorrow.**

अहं गतदिने आगतवान् अत: आगामिदिनपर्यन्तं तत्र स्थास्यामि ||

**నేను నిన్న వచ్చాను అందువల్ల రేపతివరకు ఇక్కడే ఉంటాను .**

**I came yesterday; therefore I shall stay there till tomorrow.**

## Unit-3

यदा—तदा

यदा = **whenever (ఎప్పుడో)**

तदा = **then (అప్పుడు )**

### SOME EXAMPLES:

यदा अध्यापक: आगच्छति तदा परिक्षा भवति ||

**ఎప్పుడు అద్యాపకుడు వచ్చునో అప్పుడు పరీక్ష జరుగుతుంది .**

**The examination takes place when the teacher comes.**

यदा मम मित्रम् आगमिष्यति तदा अहं चलनचित्रं द्रक्ष्यामि||

**నా మిత్రుడు ఎప్పుడు వస్తే అప్పుడు నేను సినిమా చూస్తాను**

**I shall see the movie when ever my friend comes.**

यदा अध्यक्ष: आगतवान् तदा सभाया: प्रारम्भ: अभवत्

**ఎప్పుడు అధ్యక్షుడు వచ్చారో అప్పుడు సభ ప్రారంభమైంది.**

**The meeting had commenced on the arrival of the president.**

यदा विपत्ति: संभवति तदा अप्रमत्ततया वर्तितव्यम्

**ఎప్పుడు కష్టం కలుగుతుందో అప్పుడు అప్రమత్తంగా ఉండాలి .**

**When ever there is adversity then one must behave cautiously.**

## Unit – 4

## भूतकाल: (स्म) = used to

**SOME EXAMPLES:**

1. अहं बाल्ये पाठशालां पद्भ्यां गच्छामि स्म ||

**(In my child-hood I used to go to school on foot).**

2. मम पिता मां पाठयति स्म ||

**(My father used to teach me).**

3. मम माता मां प्रेम्णा लालयति स्म ||

**(My mother used to treat me with love and affection).**

4. अहं मम मित्रै: सह क्रीडामि स्म

**(I used to play with my friends).**

5. मम भगिनी मां निन्दति स्म

**(My sister used to chide me).**

6. मम अध्यापका: पाठनस्य अनन्तरं मां ग्रन्थालयं प्रति प्रेषयन्ति स्म ||

**(My teachers used to send me to library after teaching).**

## संस्कृतश्लोक: (SANSKRIT SLOKA)

काव्य शास्त्र विनोदेन
कालो गच्छति धीमतां
व्यसनेन च मूर्खानां
निद्रया कलहेन वा

| | |
|---|---|
| కావ్య శాస్త్ర వినోదేన | Kaavya shaastravinodena |
| కాలో గచ్ఛతి ధీమతాం | kaalo gacchacti dheemataaM |
| వ్యసనేన చ మూర్ఖానాం | vyasanena cha murkhaaNaaM |
| నిద్రయా కలహేన వా | nidrayaa kalahena vaa |

**Intellectuals spend their time by enjoying the taste of reading kavyas and studying Sastras. On the contrary foolish people spend their time by indulging themselves in bad habits, by sleeping and by quarreling with others.**

# ఆదూరి హైమవతి



## అవగాహన

పూర్వం పరిపూర్ణ దేశాన్ని' పూజిత వర్మ ' అనే రాజు పరిపలిస్తూ ఉండేవాడు.ఆయన తన ప్రజలను కన్న బిడ్డల్లాగా చూసుకునే వాడు. ఎవ్వరికి ఏ అవసరమైనా స్వయంగా వెళ్ళి, ఆ ఏర్పాట్లు గావించేవాడు. రాజ్యంలోని ప్రజ లంతా త్రాగునీరు, సాగునీరు కోసం ఏనాడూ ఇబ్బందులు పడలేదు. ప్రజలంతా మహారాజును తండ్రిలా, దేవునిలా చూసు కునేవారు. ఆయన మాటే ప్రజలకు వేదవాక్కు.

తమదేశంలో కష్టపడి పంటలు పండించే అన్నదాతలకు సరైనరీతిలో మేలు చేయాలని సంకల్పించాడు. దీనికోసం ముందు ఎంత సంకటపరిస్థితి ఎదురైనా తన ఆలోచనకు రూపకల్పన చేయాలని నిర్ణయించుకున్నాడు.

మహారాజు ఆదేశంలో వ్యాపారులంతా రైతులు పండించే పంటలను రాజు నిర్ణయించినధరకు కొనాలనీ, వాటిని విదేశాల్లో అమ్ముకోవచ్చునీ ప్రకటించాడు. దీనివల్ల పేదరైతులంతా లాభపడగా, వ్యాపారులు తమకు నష్టం కలిగిందని బాధపడ్డారు. వ్యాపారులు తమ లాభాల్లో పదో వంతు పన్నుగా చెల్లించాలనే నిబంధన పెట్టాడు. అదీ వారికి కష్టంగా తోచింది.కాని రాజాజ్ఞ ధిక్కరించే ధైర్యం లేనందున పన్నుచెల్లిస్తూ ఉండే వారు.

ఇలాఉండగా మహారాజుగారి ఏకైక కుమారుని విద్యాభ్యాసం పూర్తై, గురుదేవులు అతడ్ని మహారాజుకు అప్పగించను వచ్చారు. మహారాజుగారు గురుదేవులను సాదరంగా ఆహ్వానించి, అర్ఘ్యపాద్యాదులు సమర్పించుకుని, తమ పుత్రుని సకల విద్యా వంతుని చేసినందుకు, కృతజ్ఞతలు తెలుపుకున్నా రు రాజదంపతులు. గురుదేవులు సంతృప్తితో ,

" మహారాజా! తమ బిడ్డడే కాదు, ఈ 'పరిపూర్ణ' దేశానికి కాబోయే మహారాజు. రాజు విద్యావంతుడు, గుణవంతుడు ఐతేనే కదా, రాజ్యంలోని ప్రజలంతా సుఖ శాంతులతో వర్ధిల్లేది! అందువల్ల మేం చేసిన పనేం గొప్పది కాదు, పైగా అది మా కర్తవ్యం కూడా. మహారాజా! అన్నట్లు మేమొక మాట చూచాయగా విన్నాం, వేగులవలన...."

"గురుదేవా! మీరు ఏం విన్నారో, మీకు అభ్యంతరం లేకుంటే మేం తెలుసుకోవచ్చా!" అని మహారాజు అడుగగా, "తప్పక మహారాజా! మీకు తెలుపాలనే నేను వచ్చాను. మన రాజ్యంలోని వ్యాపారులు కొంత అసంతృప్తిగా ఉన్నట్లు విన్నాం. వారు తమ లాభాల్లో ఎక్కువభాగం పన్నుగా చెల్లించను ఇష్టపడటం లేదనీ, వారంతా ఒక సంఘంగా ఏర్పడి తమతో ఏదో విన్న వించుకోవాలని ఆలోచన చేస్తున్నట్లు తెలియ వచ్చింది. ..."

" అవును గురుదేవా! మేమూ చారులవలన ఆ విషయం విన్నాం. కానీ వారు అధిక లాభాలు గడించి,ఒక రోజుకు మహా రాజుల మైన మమ్ములనే మించిన ధనవంతులు కావచ్చు, అంతేకాక వ్యాపారులంతా అధిక ధనవంతు లైనపుడు, రాజోద్యోగులు కూడా తమ పనులు మానేసి, లాభాపేక్షతో వారూ వ్యాపారానికి దిగవచ్చు.ఇపుడు మనం ప్రజలందరిపైనా పన్నులు వేయడం లేదు. వ్యాపారులు

(42 వ పేజీ చూడండి)

# తోటకూర ప్రసాద్



## డాలస్ లో మహాత్మా గాంధీకి ఘన నివాళి

డాలస్, టెక్సాస్: ఎంతో మంది ప్రవాస భారతీయులు డాలస్ (ఇర్వింగ్) లో ఉన్న మహాత్మా గాంధీ మెమోరియల్ ను సందర్శించి జాతిపిత 70వ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీ పాదాల వద్ద పుష్పాలను ఉంచి ఘన నివాళి అర్పించారు. ఎస్ పి నాగ్రాత్ అనే స్థానిక గాయకుడు గాంధీజీకి ఇష్టమైన రఘుపతి రాఘవ రాజారామ్ కీర్తనను ఆలపించారు. మహాత్మా గాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ కార్యదర్శి రావు కల్వల మాట్లాడుతూ స్థానిక ప్రజల సహకారంతో అతి పెద్ద గాంధీ మెమోరియల్ ను ఇక్కడ నిర్మించుకోవడం, భావితరాలకు స్ఫూర్తిదాయకంగా చూపడానికి అవకాశం కలిగిందని, గాంధీజీ సేవలను స్మరించుకోవడానికి వచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

గాంధీ మెమోరియల్ ఛైర్మన్ డాక్టర్. ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ గాంధీజీ 70 సంవత్సరాల క్రితం మరణించినప్పటికీ ఆయన సిద్ధాంతాలు, ఆశయాలతో మనందరి మధ్య ఎప్పటికీ సజీవంగానే ఉంటారని అన్నారు. దేశ స్వాతంత్ర సమపార్జనలో దాదాపు 32 సంవత్సరాల తన జీవితాన్ని అంకితం చేసి లక్షలాది ప్రజలను నిరంతరం చైతన్య పరచి, అహింసా మార్గం ద్వారా దేశానికి స్వాతంత్రం సాధించిన తీరు అనితర సాధ్యం అని, ప్రవాస భారతీయులుగా మనమందరం గాంధీ చూపిన బాటలో పయనిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం ఉండే ఒక మంచి సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని అన్నారు. గాంధీ మెమోరియల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ కమల్ కౌషల్ గాంధీజీ విశ్వ మానవాళికి ఒక ఆదర్శప్రాయమైన వ్యక్తి అని, ఆయన సిద్ధాంతాలతో ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఉత్తేజితులయ్యారని అన్నారు. ఐఏఎన్టి ఉపాధ్యక్షులు బిఎన్ మాట్లాడుతూ గాంధీజీ శాంతి, సహనానికి ప్రతి రూపమని, ఆయన గురించి ముఖ్యంగా యువతరం ఎంతో తెలుసుకొని తమ భవిష్యత్తును తీర్చుదిద్దుకోవచ్చని చెప్పారు. మహాత్మా గాంధీ మెమోరియల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ షబ్నమ్ మోద్గిల్ గాంధీజీ తన సాధారణ, పారదర్శక జీవితంతో ఎంతో మందికి ఆదర్శప్రాయులయ్యారని, ఆయనకు మరణం లేదని ఎన్ని దశాబ్దాలైనా అందరూ జాతిపితను గుర్తించుకుంటారని చెప్పారు.

పద్మవిభూషణ్, నటసామ్రాట్ డాక్టర్. అక్కినేని నాగేశ్వర రావు గారి అభిమానులు కొంతమంది కలిసి 2014 లో అమెరికా లో స్థాపించిన లాభాపేక్షరహిత సంస్థ అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (ఏ.ఎఫ్.ఏ). ఈ బోర్డు సభ్యులు అక్కినేని నాల్గవ వర్ధంతి సందర్భంగా అమెరికాలో సమావేశమై 2018వ సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు గా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. ప్రసాద్ తోటకూర ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

అక్కినేని 5వ అంతర్జాతీయ పురస్కార వేడుక"లను ఈ సంవత్సరం డిసెంబర్ 22న కరీంనగర్ నగరంలో జరుపనున్నట్లు అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షులు డా. ప్రసాద్ తోటకూర మరియు కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు రావు కల్వల వెల్లడించారు.

# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

### నల్ల ఎద్దు

మా ఇంట్లో నల్ల ఎద్దు కానీ, నల్లబట్టలు గానీ, నల్లదారం కూడా నిషిద్ధమే. ఎందుకో అచ్చిరాదని అమ్మకు బాగా నమ్మకం. పెద్దనాన్న తెచ్చిన ఎద్దులన్నీ పాలనురగలాంటి తెల్లని ఎద్దులు. ఎప్పుడైనా ఒకటి ఆరా పుల్లమచ్చలు, అంటే పసుపు వర్ణం కలిగిన మచ్చలు అక్కడక్కడా ఉంటే వాటిని తెచ్చేవాడు. ఒకసారి మా పెద్దన్న రామమూర్తికి పెళ్ళిపెత్తనం వచ్చారు. మా ఊరు రావాలంటే అమగంపల్లె దగ్గర దిగి అయిదు మైళ్ళు కాలినడకన రావాలి. లేదా, ఈదులబండి కట్టించుకుని రావాలి. సరే మాకు ఎలాగు వ్యవసాయం వుంది కాబట్టి బండిలో పిలుచుకుని వస్తామని నిర్ణయించారు. అయితే ఆ సమయంలో ఇంట్లో ఒక్కటే సేద్యపు ఎద్దు వుంది. దానికి సరైన జతకోసం పెద్దనాయన చూస్తున్నాడు. జంట బాగుండాలని వెతుకుతున్నాడు. కానీ దొరకలేదు ఈ ప్రాంతాల్లో. కొండంత ఎద్దు తెల్లని ఆకారం గండంత చెండువంటి నిండా కండలు... నాణ్యమైన జాతి ఎద్దు. బండి కట్టుకు పోవటానికి దీనికి జత ఎద్దు కావాలి. సరే ఏదో ఒకటి అని రోశన్న అల్లుడు వెంకటసుబ్బయ్య ఎద్దును అడిగాడు. వెంకటసుబ్బయ్య రెండు ఎద్దులు నల్లని నలుపులో ఉంటాయి. అవి ఈ ప్రాంతానికి చెందినవి. గట్టిగా మూడడుగుల ఉంటాయ్ ఎత్తులో. ఈ గిత్తలకు పౌరుషం, కోపం, ప్రతీకారం ఎక్కువ. వాటినే పెట్టుబడిగా పెట్టి పని చేయించుకుంటారు చాలామంది. ఎంత బరువేసినా పౌరుషానికి పని చేస్తూనేవుంటాయి. అయితే కసి.. కోపం ... ప్రతీకారం... పగ.. ఎక్కడో...ఎవరిమీదో తెలియదు. అలాంటి రెండు ఎద్దులు ఇవి. వెంకటసుబ్బయ్యకు తప్ప ఎవరి మాటా వినవు.

బండికి కానీ కాడికి కానీ కట్టాలంటే ఆయనే ఉండాలి. ఆయన మాట అంటే ...గజగజ వణికిపోతాయ్. అంతటి భయం పెట్టుకున్నాడు వెంకటసుబ్బయ్య. ఎద్దుల్లో ఒకదాన్ని కట్టుకుని ఈ వృద్ధ దంపతులను పిలుచుకురావటానికి బయలుదేరాం .. నేను, పెదనాయన. బండి కట్టేటప్పుడే మా ఎద్దు మీద బుస కొట్టింది ఈ నల్ల ఎద్దు. దీని రంగు రూపురేఖలు చూసి ఇది ఏదో వింతజంతువని భయపడిపోయి వెనక్కు తగ్గింది.

ముందే చెప్పాడు వెంకటసుబ్బయ్య బండి పెట్టెడ విప్పవద్దని.. అప్పుడప్పుడు 'అదిలిస్తూ'





ఉండమని... ముక్కుతాడుకు వేసిన పగ్గం ఎప్పుడూ చేతిలోనే పట్టుకోమని. లేకుంటే బండికి బిర్రుగా పగ్గం కట్టమని. ఎట్లో అమగంపల్లె చేరాం. దారిలో నల్ల ఎద్దు అప్పుడప్పుడు హుంకరిస్తూనే ఉంది. మా పెద్దెద్దు భయపడుతూనే వుంది. పెద్దనాయన అదిలిస్తూనే వున్నాడు. ఆ వచ్చినవాళ్ళు ఇద్దరూ భార్యాభర్తలు. బాగా వృద్ధులు కూడా. అరవైకి పైబడి వుంటాయి.

వచ్చిన అతిథులిద్దరినీ బండి ఎక్కించాం. నేను నాగల్లో కూర్చుని బండి తోలుతున్నా. పెద్దనాయన బండి ముందు నడుస్తూ.... అప్పుడప్పుడు అదిలిస్తూ నల్లెద్దుపై ఒక కన్నేసి ఉంచాడు. నన్ను మాత్రం నల్లెద్దు పగ్గం జాగ్రత్తగా పట్టుకోమన్నాడు. నేను జాగ్రత్తగానే వున్నా. ఔకుపల్లె దాటి కంకర రోడ్డు దిగాం. అప్పుడప్పుడే నగిలేరు డ్యాం నుండి పలుగురాళ్లపల్లె చెరువుకు నీళ్ళు ఇవ్వటానికి కాలువ త్రవ్వుతున్నారు.

అదో ... ఆ ప్రదేశంలోనే నల్లెద్దు ఉన్నట్లుండి హుంకరించింది. బుస కొట్టి మా ఎద్దుపై పడింది... అంతే ... కన్ను మూసి తెరిచేలోపు బండి తిరిగిపోయి గుంటలో పడింది. బండిలో ఉన్న వృద్ధ దంపతులు గోతిలో పడ్డారు. అగ్రహోదగ్రుడైన పెదనాయన నల్ల ఎద్దును నాలుగు సతికి ... బండిని నిలబెట్టి వాళ్ళని ఎక్కమన్నాడు.

గజగజ వణికి పోతున్నారు వారు. నడిసముద్రంలో నావలా ఉంది వారి పరిస్థితి. దెబ్బలు ఏమీ తగలలేదు. వెనక్కి పోవాలన్నా నాలుగు మైళ్ళు పోవాలి. భయం భయంగా బండిలో కూర్చున్నారు. సరే ప్రతీకారం తీర్చుకున్నాననుకుందేమో నల్ల ఎద్దు ఇంటికి వచ్చేవరకు బుద్ధిగా వుంది. వెంకటసుబ్బయ్య భయంభయంగా కనిపెట్టుకునే వున్నాడు. ఆయన మాట వినబడగానే నల్లకుక్కలా తల వేలాడేసింది నల్ల ఎద్దు.

(ఇంకా వుంది)

# ఎలక్ట్రాన్

# ఆచార్యదేవోభవ



మర్నాడు ఉదయం తొమ్మిదింటికల్లా పరీక్షలు గావించిన ఇద్దరు డాక్టర్లలోనూ ఒకామె వచ్చి సులోచనకు రిపోర్టులు అందజేసింది. ఆ సమయానికి కోదండం కూడా సులోచన గదికి వచ్చి డాక్టరుకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. డాక్టరు ఇద్దరితోటీ ఓ అరగంట మాట్లాడి, కోదండం అందించిన 25 వేల చెక్ అందుకొని వెళ్లిపోయింది. శాంతి గర్భవతి అన్న మాట వాస్తవమే! ఓ నలుగురికి సుఖవ్యాధులున్నాయి.

"ఈ ఖర్చు భరించినందుకు ధన్యవాదాలు."

"విద్యార్థినుల ప్రత్యేక సంక్షేమ పథకం కింద ఖర్చు జమ అయిపోతుంది పర్వాలేదు. ఇప్పుడు తరువాయి కార్యక్రమం? ధనంజయ్ కాదంటే?" కోదండం అన్నాడు.

"ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన ఇదొక్కటే సమస్యకాదు. మాదక ద్రవ్యాల సరఫరా ఎలా జరుగుతోంది, ఎంతమంది ఆ మహమ్మారి గుప్పిట్లో చిక్కుకు పోయారో తెలుసుకోవాలి. నెలరోజుల్లో పరీక్షలు తరుముకు వస్తున్నాయి. ఈ లోపుగా మనం ఏ విధమైన చర్యలు తీసుకొన్నా సంక్షోభం తలెత్తడానికి ఆస్కారం ఉంది. అలాగని భయపడిపోవడమూ మంచిది కాదు. చాలామంది విద్యార్థులు విజ్ఞులు. వారి అండ మనకి ఉంటుంది. ముందస్తుగా మీరు ఓ కారు పంపించి శాంతి తల్లిదండ్రుల్ని ఏదోవంకన పిలిపించండి. ఏలూరు ఇక్కడికి 150 కిలోమీటర్లు. యిప్పుడు పంపిస్తే సాయంత్రానికల్లా వచ్చేస్తారు. వారితో మాట్లాడి ఏం చెయ్యాలో ఆలోచిద్దాం."

సాయంత్రం అయిదు గంటలకల్లా శాంతి తల్లిదండ్రులు ఎకాఎకిని సులోచన గదిలో ఆందోళన పడుతూ ప్రవేశించారు. సులోచన వారిని కూర్చోబెట్టి కోదండానికి ఫోన్ చేసింది. కోదండం మూడు నిముషాలలో పరుగు పరుగున వచ్చాడు. శాంతి తల్లిదండ్రులకి అభివాదంచేసి ఓ పక్క కుర్చీలో కూర్చున్నాడు. అప్పుడే తరగతులు సమాప్తి అయ్యే సమయం. జోగిరాజు కాపు కాసి, శాంతి బయటకి రాగానే ప్రిన్సిపాల్ గారు తీసుకు రమ్మన్నారంటూ ఆమెను తీసుకు వచ్చాడు. తల్లిదండ్రుల్ని చూడగానే ఆమె ఒక్కసారి బిత్తరపోయింది. ఆమెను చూడగానే తల్లిదండ్రులు హాయిగా ఊపిరి పీల్చారు. సులోచన శాంతిని కూర్చోమని చెప్పింది. కాస్త బెదురుతోనే తల్లిపక్కన కూర్చుంది.

"'అమ్మాయి ఆరోగ్యం బాగోలేదు, హాస్పిటల్లో చేర్పించాం, వెంటనే బయలుదేరి రండి' అని కబురు పంపిస్తే మీరు పంపిన కారులో బయలుదేరి వచ్చేశాం. అమ్మాయిప్పుడు క్లాస్ రూం నుంచి తిన్నగా వచ్చేసింది. ఎందుకు సార్ కంగారు పెట్టేశారు?" శాంతి తండ్రి మాధవరావు కాస్త నిష్ఠూరంగానే అడిగాడు.

"మా కబురందగానే తల్లిదండ్రులుగా మీరు పడ్డ ఆవేదన సహజం. సంగతి ఎలా చెప్పాలో తెలియక, కాస్త అబద్ధం ఆడి మిమ్మల్ని రప్పించినందుకు మమ్మల్ని క్షమించాలి. కానీ ఓ విద్యార్థినిగా మీ శాంతిని గురించి మేమూ అంతే ఆవేదనకి గురౌతున్నాం. ఆమె చదువుని గురించి కాదు కాని, ఆమె భవితని గురించి. పరీక్షల ముందు విద్యార్థినుల మానసిక పరిస్థితిని పరీక్షించడం కోసం వైద్యుల చేత కొన్ని ఆరోగ్య

పరీక్షల్ని చేయించాం. శాంతి రిపోర్టు ఇది. చదవండి!" అంటూ సులోచన రిపోర్టు అందించింది. మాధవరావు రిపోర్టు చదువుతూనే కోపంగా కుర్చీలోంచి లేచాడు. సులోచన అతనివైపు జాలిగా చూసింది. మాధవరావు తమాయించుకొని తిరిగి కూర్చుని శాంతి వైపు క్రోధంగా చూశాడు. "ఏం జరిగిందండీ?"వసంతమ్మ ఆందోళనగా అడిగింది.

"అమ్మాయినే అడుగు! మన పరువు గంగలో ముంచేసింది! " అన్నాడు పళ్ళు పటపటా కొరుకుతూ. శాంతి గుట్టు బయటపడిపోయిందని గ్రహించింది. సులోచన వైపు బేలగా చూసింది.

"శాంతీ! నీ తల్లిదండ్రులు నీ నుంచి సమాధానం ఆశిస్తున్నారు. ఏ పరిస్థితులు నిన్నీ మార్గంలోకి మళ్లించాయో చెప్పు. స్త్రీ పురుష బంధాలు సహజమైనా సమాజం కొన్ని నియమాలు ఏర్పాటు చేసింది. వాటికి విరుద్ధంగా నువ్వు ధైర్యంచేసి హద్దులు దాటావు. అదే ధైర్యంతో సమాధానం కూడా చెప్పగలగాలి," అంది సులోచన లాలనగా.

శాంతి సమాధానం క్లుప్తంగా చెప్పింది. "నేను అందంగా ఉండనన్న ఓ న్యూనతభావం నన్ను నిరంతరం బాధించేది. ఓ మానసిక దౌర్బల్యం ఏర్పడింది. పెళ్లిచేసుకొంటాన్నన్న వాగ్దానంతో ప్రణవకుమార్ అనే ఓ ఫైనల్ ఇయర్ విద్యార్థి నా బలహీనతను సొమ్ము చేసుకొన్నాడు. ఆ నమ్మకంతోనే రాబోయే దుష్ఫలితాలను ఆలోచించకుండా అటువైపు మళ్ళాను!".

"ప్రణవకుమార్ యిప్పటికీ ఆ వాగ్దానాన్ని నిలుపుకోడానికి సిద్ధంగా ఉన్నాడా? అతగాడికి మాదకద్రవ్యాల అలవాటుందన్న సంగతి నీకు తెలుసా?"

"తెలియదు. కానీ ఎప్పుడూ ఉత్సాహంగానే కనబడ్తాడు. కారణం మీరన్నదే కావొచ్చు. బహుశా ఆ మత్తులోనే నేను అందంగా కనబడి ఉండొచ్చు. పరీక్షలైపోగానే పెళ్లిచేసుకొంటానని చెప్తూనే ఉన్నాడు. ఆ రోజుకోసం ఎదురు చూడ్డం తప్ప నేను చేయగలిగింది లేదు!"

"అతను కాదంటే!"

"కాలవలకీ, సీలింగ్ ఫ్యాన్లకి కొదవలేదు!"

"అలాకాకుండా నలుగురి ఎదుటా నిలదీసి బుద్ధిచెప్పే ధైర్యం నీకు లేదా?"

"అమ్మానాన్నల పరువు పోతుంది!" "నిన్ను నువ్వు అర్పించుకొన్నరోజే నీ వ్యక్తిగతమైన పరువు పోగొట్టుకొన్నావు. నువ్వు ఆత్మహత్యచేసుకొన్నా లోకానికి నిజం తెలుస్తుంది. అప్పుడూ నీ అమ్మానాన్నలకి పరువు భంగమే కాకుండా, తీరని వ్యథకూడా!"

సులోచన శాంతి తల్లిదండ్రుల్ని ఉద్దేశించి అంది. "మీ అమ్మాయి ఆలోచనలేవిధంగా ఉన్నాయో మీరు గ్రహించే ఉంటారు. తెలిసో, తెలియకో తప్పటడుగు వేసింది. మూడోనెల దాటింది కాబట్టి భ్రూణహత్య న్యాయసమ్మతం కాదు. ఒక్క నిముషం." సులోచన కంప్యూటర్లో ప్రణవకుమార్ వివరాలు తెరమీదకు తీసుకు వచ్చి చదివింది.

"ప్రణవకుమార్ రాజమండ్రిలోని ఓ యిసుక వ్యాపారి ధనంజయ కొడుకు. తల్లి అనసూయ. ఎంసెట్ ర్యాంక్ ఎనభైవేలకు పైగానే. యాజమాన్యం కోటాలో రెండు లక్షలు కట్టి చేరాడు." ఒక్క క్షణం ఆగి మళ్ళీ అంది. "ఓ విద్యార్థిని బ్రతుకు ఇలా దుర్గతి పట్టడం ఎవరికీ అభిలషణీయంకాదు. తల్లిదండ్రులుగా మీరు ధైర్యంగా ముందడుగు వేస్తే కాని సమస్యకి పరిష్కారం లభించదు. ధనంజయ్ దంపతుల్ని మిమ్మల్ని పిలిచినట్లుగానే పిలుస్తాం. మాట్లాడి చూద్దాం. సామాజికవర్గాల గురించి, అంతస్థుల భేదాల గురించి ఆలోచించ వలసిన సమయం కాదు. ఏమంటారు?"

"మనకెందుకులే అని చూస్తూ ఊరుకోకుండా మీరు తీసుకున్న శ్రద్ధకి ఎలా కృతజ్ఞతలు తెలుపుకోవాలో తెలియటల్లేదు. పిలిపించండి. పర్యవసానం ఎలా ఉన్నా మా పిల్ల పట్ల ఉన్న పేగు బంధాన్ని తెంచుకోము. శాంతి మా అనాదరణకి నోచుకోదు." అన్నాడు మాధవరావు.

వసంతమ్మ మనసు కుదుటబడింది. సులోచన ఆ దంపతులకి కళాశాల అతిథి గృహంలో వసతి కల్పించింది.

కోదండం, సులోచన ఆ రాత్రికి రాత్రి మండల పోలీసుస్టేషన్ సబ్ ఇనస్పెక్టర్ ఆనంద్ కి సంగతి తెలియజేశారు. ఆనంద్ వెంటనే వచ్చి, జోగిరాజు సహాయంతో తీగలు లాగి రాత్రి ఒంటిగంటకల్లా పదిమంది మాదకవీరుల్ని బుట్టలో పెట్టేశాడు. కోదండం వారి తల్లిదండ్రులకు 'స్కూటర్ ప్రమాదంలో కాలి ఎముక విరిగి మీ వాడు హాస్పిటల్లో పడున్నాడని, ప్రాణహాని లేదనీ, కానీ అత్యవసరంగా ఆ మర్నాటి కల్లా సతీ సమేతంగా రమ్మని" ఫోన్ చేశాడు.

ప్రణవకుమార్ తల్లిదండ్రులు రాజమండ్రి నుంచి ఉదయమే బయలు దేరి ఎనిమిదింటికల్లా కళాశాల ప్రాంగణం చేరుకొన్నారు. వాళ్ళు బయలు దేరిన సంగతి తెలుసుకొని, ఉజ్జాయింపుగా వచ్చే సమయానికి కోదండం మండల పోలీసు అధికారితో సహా వచ్చి సులోచన గదిలో ఎదురుచూస్తూ కూర్చున్నాడు. వాళ్ళు గదిలోకి రాగానే కోదండం పలకరించి కుర్చీల్లో కూర్చోబెట్టాడు. కాఫీలు పంపించమని క్యాంటీన్ కి ఫోన్ చేశాడు. "కాఫీలు తాగే పరిస్థితిలో లేము! ఏ ఆస్పత్రిలో చేర్పించారో చెబ్తే వెళ్ళి చూస్తాం. పరీక్షలముందు ఈ బెడద ఏమిటో?" అన్నాడు ధనంజయ్.

"కాలూ, చెయ్యీ విరగలేదు. బుద్ధిమట్టుకు విరిగింది. దానికోసం వైద్యం జరగాలి. ఏ ఆస్పత్రిలో చేర్పించుకొంటారో మీ యిష్టం!" అన్నాడు సబ్ ఇనస్పెక్టర్ ఆనంద్! "మీరనే మాటలు నాకర్థం కావటల్లేదు! మావాడు ఎవర్నైనా గుద్దేసి గాయపర్చాడా?" ధనంజయ్ ఆదుర్దాగా అడిగాడు.

యిద్దరు కానిస్టేబుల్స్ పదిమంది విద్యార్థుల్నితీసుకువచ్చి గదిలో ఓ గోడవారగా నిలబెట్టారు. అందులో ప్రణవకుమార్ మధ్యగా నిలబడి తల్లి దండ్రుల్ని చూస్తూనే తల దించుకొన్నాడు. ప్రణవకుమార్ తల్లి అనసూయ కుర్చీలోంచి లేచి వెళ్లబోయి, ధనంజయ్ చెయ్యి పట్టుకొని లాగడంతో తిరిగి కుర్చీలో కూర్చుండి పోయింది. కొంగుతో కళ్ళు తుడుచుకోనారంభించింది. అంతలో మరో నలుగురు దంపతుల జంటలు వచ్చి కూర్చున్నారు. గోడవార నిల్చున్నకుర్రవాళ్లను చూస్తూనే వాళ్ళ మొహాలు కళావిహీనమైయ్యాయి. క్యాంటిన్ బాయ్ వచ్చి అందరికీ పేపరు గ్లాసుల్లో కాఫీ అందించి పోయాడు. "మిమ్మల్నందర్నీ ఏదో కుంటి సాకు మీద రప్పించడానికి మాకు చాలా బలమైన కారణం ఉంది. ఆ పది మందీ మాదకద్రవ్యాలతో పట్టుబడ్డారు. పక్క పట్నంలో ఉన్న ఓ టీ దుకాణం వాడు పంపిణీ దారుడిగా పట్టు బడ్డంతో, ఆ విద్యార్థులందరూ కేవలం ఉపయోగదారులే కావడం మూలాన, గుడ్డికన్నా మెల్ల నయం అన్నట్టుగా బతికిపోయారు. అందరు తల్లి దండ్రుల్నీ పిలిపించాం. మీరు కొంతమంది రాత్రికి రాత్రి ప్రయాణం చేసి వచ్చారు. అందుకు ధన్యవాదాలు. మరికొంతమంది దారిలో ఉన్నారు. ఎవరికి వారు జామీను మీద వారి వారి పిల్లల్ని విడిపించుకోవచ్చు. వాళ్ళనందర్నీ క్రమశిక్షణారాహిత్యం కారణంగా చూపించి కళాశాల నుంచి బర్తరఫ్ చేసే అధికారమున్నా, వారి విద్యార్థి దశని నాశనం చెయ్యడం మా అభిమతం కాదు. అలాగని ఈ విషయం మీద ముసుగు కప్పి విషవృక్షాన్ని పెంచి పోషించడమూ మా అభిమతం కాదు. అది మీకూ శ్రేయస్కరం కాదు. ఒక్క రాత్రిలో ఈ వ్యసనాన్ని మాన్పించదమూ సాధ్యం కాదు. బెంగళూరునుంచి ఇద్దరు నిపుణులు రేపు సాయంత్రానికి వచ్చి కౌన్సిలింగ్ మొదలు పెడ్తారు. వాళ్ళు నెలరోజులపాటు అధ్యయనం చేస్తూ వైద్యం చేస్తారు. మీకు సాధ్యమైతే

నెలరోజులూ దగ్గరుండి చదివించుకోండి. కావాల్సినవారికి ఏదో విధంగా ప్రాంగణంలో వసతి సౌకర్యం ఏర్పాటు చేస్తాను. ఏమంటారు? అంగీకరించినవారు చేతులెత్తండి. అంగీకరించనివాళ్లు మీ పిల్లల్ని యింటికి తీసుకుపొండి." అందరూ చేతులెత్తారు. "అయితే మీవల్ల నాకు కావల్సిన సహాయంమరొకటిఉంది.అసలు కాలేజీ సమావేశ మందిరంలో ఈ విషయం విద్యార్థులముందుకు తీసుకువద్దామని అనుకొన్నాను. కానీ తల్లిదండ్రులుగా మీ నిర్ణయం ఏమిటో తెలుసుకోవాలని ఉంది. శాంతి అనేఓమూడోసంవత్సరంఅమ్మాయిని ప్రణవకుమార్ అనే అతను పెళ్లిచేసుకొంటానన్న వాగ్దానం చేసి ఆమెను గర్భవతి చేశాడు. అతను చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకొంటాడన్న ఆశతోనే ఆమె ఉంది. ఆ వాగ్దానం అవకాసం కోసమే చేశాడంటే, అతన్ని నమ్మడమే ఆమె చేసిన తప్పు. ఆ తల్లిదండ్రుల్ని, వారి అమ్మాయినీ చూద్దురు గాని."

"వివాహం అన్ని విధాలా శ్రేయస్కరం" అన్నారు ఇద్దరు ముగ్గురు. అలా అన్నవారిలో ధనంజయ్ లేడు.

శాంతి, తల్లిదండ్రులు గదిలో ప్రవేశించారు. ధనంజయ్, అనసూయ వారిని చూశారు. అనసూయ లేచి కుర్చీని పక్కకు జరిపి, కొడుకు దగ్గరకు వెళ్ళి సాచి లెంపకాయ కొట్టింది. "అప్రాచ్యుడా! అక్కడ మా అన్న కూతురితో సంబంధం కుదుర్చుకొని, తాంబూలాలుకూడా పుచ్చేసుకొన్న తర్వాత ఇక్కడ నువ్వు చేసిన ఘనకార్యమా యిది?"

"తను అబద్ధమాడుతోంది. తనెవరో కూడా నాకు తెలియదు!" ప్రణవకుమార్ వంచిన తల ఎత్తకుండా అన్నాడు.

"అవొచ్చు! కాదనలేము ప్రణవకుమార్జీ! నీకూ, ఆమె కడుపులో ఉన్న శిశువుకూ జన్యుపరీక్షలు చేసి ఎవరు అబద్ధమాడుతున్నారో తెలుసుకొనే వరకూ మా నిర్బంధంలో ఉందువు గాని!" అన్నాడు ఆనంద్.

"అంతదూరం అవసరం లేదు సార్! ఆ దరిద్రుడి ఎడమ పిర్రమీద మినపగింజల పరిమాణంలో రెండు నల్లటి పుట్టుమచ్చలు పక్కపక్కనే ఉంటాయి. యిప్పుడే చూడండి." శాంతి గొంతెత్తి అరిచింది. ఆనంద్ లేచి వెళ్ళి ప్రణవ కుమార్ ని లాగు దించమన్నాడు. ఆనంద్ చూపులకి భయపడిపోయి ప్రణవకుమార్ బెల్ట్ తీస్తుండగా "ఆ అవసరం లేదు! ఆ అమ్మాయి చెప్పిన మాట నిజమే! మా అన్నకి ఏదో సమాధానం చెప్పి సంబంధం వదులుకుంటాం. శాంతిని మా యింటి కోడలుగా చేసుకొంటాం!" అంది అనసూయ భయం భయంగా.

"మీ అందరి ఎదుటా 'వివాహం చేసుకొంటాను,' అన్న ఒక్క మాట అంటే రాజీ పడిపోయేదాన్నేమో? అతనన్న మాట విన్నతర్వాత ఇప్పుడు నేను సిద్ధంగా లేను. ఒకసారి చేసిన తప్పు రెండోసారి చెయ్య దల్చుకోలేదు! నా దౌర్భాగ్యమేమిటంటే మీ సుపుత్రుడి జీవం నాలో పెరుగుతూ ఉండడమే! ఇప్పుడే నలిపేద్దామంటే చట్టం ఒప్పుకోదు. ఆ జీవి భూమ్మీద పడ్డ తర్వాత ఏం జరిగేదీ తర్వాత ఆలోచిస్తాను. డిగ్రీ అందుకొనే వరకూ ఎవరేమనుకొన్నా చదువు కొనసాగిస్తాను. అమ్మా పదండి పోదాం!" అంది శాంతి నిబ్బరంగా. వాళ్ళు ముగ్గురూ ఆ గదిలోంచి నిష్క్రమించారు.

కోదండం అప్పటికప్పుడు ప్రణవకుమార్ ని బర్తరఫ్ చేస్తూ ఆర్డరు టైప్ చేయించి, తండ్రీ కొడుకుల సంతకాలు తీసుకొని అందజేశాడు. ఆనంద్ ఓ పోలీసు వాన్లో అయిదుగురు దంపతుల్నీ, వారి సుపుత్రులతో మేజిస్ట్రేట్ వద్దకు పంపాడు. మిగిలిన అయిదుగురు విద్యార్థుల్నీ వాళ్ళ తల్లిదండ్రులు వచ్చేవరకూ మండల పోలీసు స్టేషన్ కి తరలించాడు.

తర్వాత సులోచన సుఖ రోగాలు అంటించుకొన్న నలుగురు విద్యార్థినుల విషయం చేబట్టింది. ఇద్దరు ఉపన్యాసకులకి కోదండం స్వస్తి పలికేశాడు. ఆ నలుగురమ్మా-

యిలకీ వైద్య సదుపాయం చేకూర్చడం జరిగింది.

వారి విషయం గోప్యంగా ఉంచబడినా, మాదకవీరుల విషయం మట్టుకు కళాశాల అంతటా తెలిసి పోయింది. పత్రికలకీ ఎక్కేసింది. స్వతంత్రించి తనంతట తానుగా యాజమాన్యం తరపున కోదండం చేబట్టిన చర్యల్ని పత్రికలు, ప్రసార వాహినూలూ మెచ్చుకొన్నాయి.

"అసలు కార్యకర్త మీరు! కీర్తి నాది!" అన్నాడు కోదండం నవ్వుతూ.

"కారణాలనేకం. నిర్మాణ లోపాలు-వర్షాలు-జోగిరాజుగారు- ఏదో కార్యాచరణ నేను సూచిస్తే నిర్ణయం మీరు సాహసించి తీసుకొన్నారు-కీర్తి మీదే, బెంగుళూరు డాక్టర్ల ఖర్చు మీదే! సత్ఫలితం మట్టుకు మన కళాశాలది!" అంది సులోచన మరింత బిగ్గరగా నవ్వుతూ.

---

## అవగాహన

(34 వ పేజీ తరువాయి)

చెల్లించే పన్నులతోనే ప్రజా సౌకర్యాలు చేస్తున్నాం. అందుకే ప్రజలంతా రాజ విధేయులై సుఖంగా ఉంటున్నారు. పేదవారు సైతం తిండికి, బట్టకూ ఇబ్బంది పడటంలేదు. నేను అది ఆలోచిస్తున్నాను గురుదేవా!" అన్నాడు మహారాజు.

"మహారాజా! నాకో ఉపాయం, మనదేశంలోని వ్యాపారులను వారికి ఇష్టమైతే ఇతర దేశాలకు వ్యాపారాలు చేసుకు వెళ్ళి వ్యాపారాలు చేసుకోవచ్చనీ ఆలాభాల్లో ఏమాత్రం పన్ను చెల్లించక్కర్లేదనీ ప్రకటించండి. వారికి అప్పుడు ఇతరదేశాల్లో వ్యాపారం, చెల్లించే పన్ను గురించీ అవగాహన కలుగుతుంది. పైగా మన దేశీయ వస్తువులకు ఇతర దేశాల్లో గిరాకీ కలుగుతుంది. మీరూ బాగా యోచించి నిర్ణయించండి" అని సలహా ఇచ్చారు గురుదేవులు.

"తప్పక గురుదేవా! మీ సూచన పాటిస్తాను." అని సగౌరవంగా గురుదేవుని సాగనంపారు మహారాజు.

ఇతర మంత్రులందరితో యోచించి గురువుగారిచ్చిన సూచన బావుందని అంతా నిర్ణయించాక, మహారాజు ఆవిషయాన్ని ప్రకటించారు .

ఈప్రకటన విని వ్యాపారులంతా ఒక కూటమిగా తయారై, చాలా సంతోషంగా మహారాజు కు ధన్యవాదాలు చెప్పుకుని, తాము ఇతరదేశాలకు వ్యాపారార్థం వెళ్ళను అనుమతిపత్రాలు పొందారు.

అలా చాలామంది వ్యాపారులు ఇతరదేశాల బాటపట్టారు. ఎక్కడా లభించని ఎన్నో వస్తువులు పరిపూర్ణ దేశంలో విరివిగా లభించటాన వాటికి బాగా గిరాకీ పెరిగి రైతులంతా ఆయా పంటలు బాగాపండించి అమ్ముకుని సొమ్ము చేసుకోసాగారు.

ఇతరదేశాలకు వెళ్ళిన వ్యాపారులకు, కొంతకాలానికి ఆ యాదేశాల రాజులు విధించే పన్నులు చెల్లించడం చాలా కష్టంగా ఉండటాన, తాము చేస్తున్న వ్యాపారానికీ తమ రాజుకు చెల్లించే పన్నూ పోల్చుకుని వారంతా తమ వ్యాపారాలు కట్టేసుకుని స్వదేశానికి తిరిగి వచ్చారు.

ఇతర దేశాల్లో పరిపూర్ణ దేశంలో పండే వస్తువులకు అలవాటైన ఆయాదేశాల ప్రజలు పరిపూర్ణ దేశానికి వచ్చి వస్తుకొనుగోలు నేరుగా పండించిన వారినుంచే చేయడంతో రైతులకులాభం చేకూరింది. వ్యాపారులు తాముకట్టేపన్ను, తాము అక్కడ చేసిన వ్యాపారానికి ఇతర దేశాల కు కట్టే దానికంటే తక్కువగా ఉన్నందున మౌనంగా ఉండి పోయారు.

మహారాజు ఇతర దేశాల నుండీ వస్తువులు కొనే వారిపైనే పన్ను స్వీకరిస్తూ, తన దేశంలోని వ్యాపారులవద్ద తగ్గించారు. ఇలా వ్యాపారులకు పైదేశాల్లో వ్యాపారం గురించీ అర్థమై మహారాజుకు ధన్యవాదాలు చెప్పుకున్నారు. తమదేశంలో కష్టపడి పంటలు పండించే అన్నదాతలకు సరైన రీతిలో మేలు చేయాలని సంకల్పించాడు. దీనికోసం ముందు ఎంత సంకట పరిస్థితి ఎదురైనా తన ఆలోచనకు రూపకల్పన చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇలా మహారాజు యోచన కార్యరూపం దాల్చి రైతులంతా సంతోషించగా, వ్యాపారులు తమలాభాలు తమకు మిగులుతున్నందుకు, ఇతరదేశాల్లో వ్యాపారం పట్ల అవగాహన కలిగి సంతోషించారు.

మహారాజు యుక్తి ఫలించింది.

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

( ఆధారం : త = అసలు అక్షరం 'ప' )

**అం సిం సై , జ శు రిం స ఖై, గ క్షి ఙు కా లిం సై , ల ఛో జీ ఖి తై**

**లం సై , సో ణ క గం ర వా ట్య గు ల డ వ్యం సై, త్య ఛా యా మి తై**

**లం సై , దం క్యు లి డం స ఖై, ఖ్యుజు లి తై లం సై, గ న య్ఝా శి తై**

**లం సై, బ ష్ణ త కో ల్ల సుం ర టు దు చ్య గ్నాం రాం స బం జ య్ఝు ఖై**

**(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)**

**గతవారం జవాబు :**

ఆకాశంబుననుండి శంభుని శిరం బందుండి శీతాద్రి సు
శ్లోకంబైన హిమాద్రినుండి భువి భూలోకంబునందుండి య
స్తోకాంభోధి బయోధినుండి పవనాంధోలోకముం జేరె గం
గాకూలంకష పెక్కు భంగులు వివేకభ్రష్టసంపాతముల్

సరియైన జవాబు పంపినవారు: 1) శ్రీ తుమ్మూరి రాంమోహన్ రావు 2) శ్రీ పాలెపు బుచ్చిరాజు

# కొత్త రామానందం



విశ్రాంత బ్యాంకు ఉన్నతాధి కారి


## శంభో మహాదేవ శరణం

**ఆనందమే శివస్వరూపం. అప్రమేయం ఆయన తత్త్వం. దీర్ఘ కాళరాత్రి నుంచి జగత్తును వెలుగువైపు నడిపించిన తొలిరాత్రి మహాశివరాత్రి. వేదార్థంలో పౌరాణికంగా వాఙ్మయ సాన్నిహిత్యంతో శివతత్త్వాన్ని అవగతం చేసుకుంటే ఆనందం ఏమిటో తెలుస్తుంది. ఆనందమైన శివానంద స్థితిని సర్వాత్మనా సంభావించడమే మహాశివరాత్రి.**

వాగర్థా వివా సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ ||

వాణి, సంపదలు ఏ విధంగా ఒకదాన్ని ఒకటి అంటిపెట్టుకుని అవినాభావంగా ఉన్నాయో, ఆ విధంగా ఒకర్నొకరు వదలక, ఇరువురు ఒకరుగా ఉంటే, ఈ సమస్త జగత్తుకే తల్లిదండ్రుల వంటి వారయిన, ఆ ఆదిదంపతులకు నమస్కరిస్తున్నాను. 'వాగర్థావివా' శబ్దానికి అర్థం వంటిది. శబ్దమూ అర్థమూ ఒకదాన్ని ఒకటి ఎలా అంటిపెట్టుకుని ఉంటాయో, పార్వతీ పరమేశ్వరులు కూడా అంతగా శబ్దానికి అర్థంలా, ఒకర్నొకరు అంటిపెట్టుకుని, ఇరువురూ ఒకరుగా అవినాభూతులై ఉంటారు.

అలాంటి అపూర్వ సమ్మిలనమే అర్ధనారీశ్వర తత్త్వం. ఆ అలౌకిక సంగమమే సృష్టి ఆవిర్భావ ప్రక్రియకు మూలాధారం. పార్వతీ అమ్మవారు అలా పరమశివుని శరీరంలో అర్ధభాగమై ఉండటంవల్లనే, భార్యను 'అర్ధాంగి' అనంటారు.



ఆవిధంగా జగత్పితరులైన పార్వతీ పరమేశ్వరులకు 'వందే' నమస్కరిస్తున్నానని అర్ధం. బ్రహ్మం (ఆదిదైవం) తన దేహాన్ని రెండుగా విభజించుకుని ఒక భాగం పురుషునిగా, రెండవ భాగం స్త్రీగా అయింది. అంతటా ఆ పురుషుడు ఆ స్త్రీ యందు విరాట్టును సృష్టించాడు. ఆ విరాడ్రూప-



మే వేయితలలు, వేయి కనులు, వేయి పాదాలతో భూర్భువస్సువర్లోకాల్ని అధిగమించి, విశ్వమంతా పూరించి ఉన్న దృశ్యమాన జగత్తుగా ద్యోతకమైంది. (పురుష సూక్తం) అర్ధనారీశ్వర తత్త్వం నుంచి సృష్టి ఆవిర్భవించడంతో పార్వతీ పరమేశ్వరులు జగత్పితరులయ్యారు.

ఆయన ఆదిదేవుడు. ఆయన ఆది మధ్యాంత రహితుడు. అడిగినవారికి అడిగినంత ఇచ్చే భోళాశంకరుడు. తాను గరళాన్ని మింగి, లోకాలకు అమృతాన్నిచ్చిన మహోదరుడు శంకరుడు. తాను శ్మశానవాసిగా భిక్షాటన చేస్తూ, భక్తులకు సకలైశ్వర్యములనిచ్చే భక్తజన సులభుడు పరమశివుడు. ఆ 'శివం' అంటే పరమేశ్వరుడు. 'శివా' అంటే పార్వతి. ఇలా అయ్యవారిలోనే అమ్మవారు ఉండీ తనను ప్రార్థించినవారి కొంగుబంగారం. తనను ఎలా పూజించినా సరే, కేవలం భక్తికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చే అభయంకరుడు శంకరుడు. ఆ మహేశ్వరుని విభూది ధరించని నుదురు, ఈశ్వరార్చన చేయని జన్మం, శివాలయం లేని గ్రామం, శివ సంబంధం లేని విద్య అత్యంత నీచములు, నింద్యములని జాబాలోపనిషత్తు చెబుతోంది. అందుకే మనదేశంలో శివాలయం లేని ఊరు ఉండదు. శివాలయం లేని ఊరు శ్మశానంతో సమానం.

సకల విధములైన కర్మలను తన వశంలో ఉంచుకునేవాడు 'వశీ' అగుచున్నాడు. 'వశీ' యే 'శివ' అయింది. 'శివ' శబ్దానికి వశియనగా జితేంద్రియుడు అని అర్థం.

శివుని హృదయం సౌందర్యవంతమైంది. ఆ సౌందర్యాన్ని ఒకసారి చూసినవారు మనసు పారేసుకుంటారు. శివుడు అయస్కాంతమైతే మన హృదయాలు సున్నితమైన గుండుసూదులు. జగన్మాత గంభీరమైన మనసే శివానందలహరిలో విచ్చుకున్న పద్మంలా తేలియాడిందంటే మనవంటి వారి గురించి చెప్పేదేముంది? మూడు కాలాల్లోనూ స్వచ్ఛమైన ప్రవాహంలా ప్రకాశించే శివానందలహరి పతితులను, బహుజనులను, సామాన్యులను తనలో స్నానం చేయించి, అందరినీ, ఆదరించి అక్కున చేర్చుకుంటుంది. భక్త సులభుడు అయిన శివుడు వేదవేద్యుడు.

ఆయన దిగంబరుడు - అంటే దిక్కులనే వస్త్రముగా కలవాడు. లయకారుడైన ఆయన చేతిలో త్రిశూలం శోభిల్లుతూ ఉంటుంది. దుర్జనులను భయ కంపితులను చేస్తుంటుంది. సజ్జన సంరక్షణార్థం బద్ధ కంకణుడైన శంకరుడు. ఆయన మరొక చేతిలో డమరుకం ఉంటుంది. డమరుకం జ్ఞానోద్ధాతమై శోభిల్లుతుంటుంది. పాణిని మహర్షికి వ్యాకరణ బీజాలు చెవి దగ్గర వాయించి వ్యాకరణ రహస్యాలు బోధపరిచారట.

అలాగే ఆయన శరీరంపై సర్పాలు. పాముదంతాలను పీకివేసినపుడు పాము ఎలా హానికరం కాదో, అలాగే కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు అంత తేలికగా పోయేవికావు. కానీ వాటిని అదుపులో

ఉంచుకోగలిగితే అవి ఎలాంటి హాని చేయవు. శివుడు జ్ఞానదేవుడు. జ్ఞానులకు మాత్రమే ఇతరుల తప్పులు త్వరగా గోచరమవుతాయి. కేవలం శంకరుడు మాత్రమే క్షీరసాగర మధనం ద్వారా ఉద్భవించిన హాలాహలాన్ని పానం చేసి తన కంఠంలో నిక్షిప్తం చేసి మహాదేవుడయ్యాడు.

మహేశ్వరుడు భస్మమే అంగరంగ వైభవంగా - అంటే శ్మశానంలో లభించే చితా భస్మాన్ని విభూతిగా అలంకరించుకునేవాడు. శివ చిహ్నాలలో త్రిపుండ్రాలు ఒకటి. నుదుటి మీద అడ్డముగా పెట్టుకునే మూడు గీతాలనే త్రిపుండ్రాలంటారు. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అనే మూడు శక్తులకూ ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం అనే మూడు వేదాలకు, ఓంకారానికి ఈ త్రిపుండ్రాలు ప్రాతినిధ్యం వహిస్తాయి. కాలాగ్ని రుద్రుడైన శివునికి త్రిపుండ ధారణ ఎంతో ప్రీతికరణ వహిస్తాయి.

### మహిమాన్వితం మారేడు

ఒక బిల్వం శివుడికి ఇష్టమైన పత్రి. వేయి పద్మాలతో పూజ చేస్తే లభించే ఫలితం ఒక్క బిల్వదళంతో చేస్తే వస్తుంది. బిల్వ వృక్షం ఉన్న చోటే తానూ ఉంటానని శివుడు అంటాడు. మూడు ఆకులను ఒకటిగా కలిపి ఉంచే బిల్వదళం శివుని త్రినేత్రాలకూ, త్రిమూర్తులకూ, త్రిగుణాలకూ సంకేతం. పుణ్యక్షేత్రాలన్నింటిలోని ప్రభావమూ ఒక్క మారేడు చెట్టులోని ఉంటుందట. బిల్వ వృక్ష వేళ్ళను గంధంతో, పుష్పాలతో అర్చిస్తే వంశం వృద్ధిలోకి వస్తుంది. వృక్షం చుట్టూ దీపారాధన చేస్తే జ్ఞానం లభిస్తుంది. ఈ చెట్టు క్రింద ఒకరికి అన్నం పెడితే కోటి మందికి పెట్టిన ఫలితం ఉంటుంది. ఈ చెట్టు కింద అన్నపు పాయసాన్ని చేతితో సహా ఒక శివభక్తునికి ఇస్తే జన్మ జన్మలకూ అన్నం లోటుండదట.

### రుద్రాక్ష మహిమ

శివ సంబంధమైన చిహ్నాలలో రుద్రాక్ష ఒకటి. రుద్రుడు అంటే శివుడు. ఆయన ఆనంద బాష్పాలే రుద్రాక్షల రూపం ధరించాయి. రుద్రాక్ష త్రిమూర్తి స్వరూపం. రుద్రాక్ష మూలంలో బ్రహ్మదేవుడు, మధ్యలో విష్ణువు, అగ్రంలో శివుడు ఉంటారు. రుద్రాక్ష అర్చన శివలింగార్చనతో సమానం. రుద్రాక్షలు ధరిస్తే సమస్త పాపాలు తొలగిపోతాయి. రుద్రాక్షలను నెత్తిమీద పెట్టుకుని స్నానం చేస్తే గంగా స్నాన ఫలం లభిస్తుంది. రుద్రాక్షలతో జపం చేస్తే అలౌకికమైన ఆనందానుభూతి కలుగుతుంది. వేయి రుద్రాక్ష పూసలను పై భాగాన ధరించినవాడు సాక్షాత్తు శివునితో సమానుడు. రుద్రాక్షలు ధరిస్తే రక్తపోటును, హృద్రోగాలను నివారించవచ్చునని చెబుతున్నారు.

భక్త కన్నప్ప పూజలు శివుని అర్చించటానికి, అభిషేకించడానికి ఏం కావాలి? ఆయన్ను ఎలా ఆరాధించాలి అంటే భక్త కన్నప్ప చరిత్ర మనకు మార్గదర్శనం చేస్తున్నది. ఓ ఆదివాసి గిరిజనుడు, నిరక్షరాస్యుడు, అయితేనేం గొప్ప శివభక్తుడు. ఎన్నో చోట్ల నడిచిన చెప్పులతో శివలింగాన్ని శుభ్రం చేయగా దాన్ని శివుడు కుంచెతో వేసిన సపర్యగా భావించాడు. పుక్కిలి పట్టిన నీటిని శివలింగంపై ఉమ్మి కడిగాడు. దాన్ని పరమశివుడు మహాభిషేకంగా భావించాడు. ఎంగిలి చేసిన మాంసం ముద్దలను తినిపిస్తే ఆనందంగా స్వీకరించాడు. అదీ పరమశివుని గొప్పతనం. భక్తిని చూస్తాడు. భక్తిలోని లోతులను కొలుస్తాడు. ఆయనకు నచ్చిందా.... ఆ భక్తుడికి సకల శుభాలూ ప్రసాదిస్తాడు.

భక్తులను అనుగ్రహించడంలో ఇంత సులభుడు మరి లేడు. విధివిహితమని మార్కండేయుని చంప వచ్చిన మృత్యువును భస్మం చేసి మృత్యుంజయుడైనాడు.

అర్హుడు అర్హతకు తగు ఫలం పొందవలసిందేనని శివుని హృదయం. అతనిలో ఇతర విషయాలలో అనర్హ లక్షణాలు ఉండవచ్చుకాక, దాని ఫలితం వేరే అనుభవిస్తాడు. దేనికదే ఆయన దృష్టిలో. భస్మాసురునికి నెత్తిమీద చేయి పెడితే భస్మం చేసే శక్తిని వరంగా ఇచ్చి తానూ ఆపదల పాలయ్యాడు.



శివుడు జ్యోతి రూపంలో లింగాకారంగా ఆవిర్భవించిన సమయం కనుక శివరాత్రిని లింగోద్భవ కాలమంటారు. మాఘ మాసంలో కృష్ణ పక్షంలో చతుర్దశి నాడు వస్తుంది. అర్ధరాత్రి వచ్చే పండుగలు రెండు: 1)జన్మాష్టమి 2) శివరాత్రి. జన్మాష్టమి నుంచి 180 రోజులు లెక్కిస్తే శివరాత్రి వస్తుంది. అర్ధరాత్రి పన్నెండు గంటలకు లింగోద్భవమవుతుంది. అప్పుడు సర్వక్షేత్రాలలోనూ అందరూ నిద్రపోకుండా మేల్కొని ఉపవాసముండి మహాలింగ దర్శనం చేస్తారు.

వేదాలలో యజుర్వేదం గొప్పది. యజుర్వేదంలోని నాల్గవ కాండలో ఉన్న రుద్రం ఇంకా గొప్పది. రుద్రంలో ఉన్న పంచాక్షరీ లోని రెండక్షరాలు మరీ గొప్పవి. 'శివ' అనే రెండక్షరాలవి. శివ అంటే మంగళమని అర్థం.

పరమ మంగళకరమైనది శివస్వరూపం. ఆ స్వరూపాన్ని అనుసంధానం చేసుకోదలచినవారు మొట్టమొదట చేయవలసినది 'విభూతి ధారణ'. విభూతి అంటే ఐశ్వర్యం. అది అగ్నిలో కాలిన శుభ్రమైన వస్తువు. ఈశ్వరుడు విభూతిని ఒంటినిండా అలదుకుంటాడు. రెండవది రుద్రాక్ష ధారణ. రుద్రాక్ష మరేదో కాదు. శివుని మూడో కన్ను. అందరు దేవతలలోనూ ఫాలభాగంలో కన్ను కలవాడు ఆయన ఒక్కడే. మూడవది పంచాక్షరీ జపం. పంచాక్షరీ మంత్రోపదేశం లేనివారు శివనామం జపిస్తే చాలు. నాలుగోది మారేడు దళాలతో శివుని పూజించడం. శివునికి మూడు కన్నులున్నట్లే, మారేడుకు మూడు దళాలుంటాయి. లక్ష్మీదేవి నివాసముండే వస్తువులలో మారేడు ఒకటి. మారేడు దళం వెనుక భాగంలో లక్ష్మి ఉంటుందట. అందుకే మారేడుదళం వెనుకభాగం లింగానికి తగిలేటట్టు పూజ చేస్తాం. అయిదవది హృదయంలో ఎల్లప్పుడూ సదాశివ ధ్యానం. వీటితోపాటు అంతరంగంలో శివస్వరూపాన్ని ఎల్ల వేళలా స్మరిస్తూ ఉండాలి.

సాయంకాల సమయాన్ని 'ప్రదోషం' అంటారు. త్రయోదశి నాటి సంధ్యాకాలం మహాప్రదోషం. ప్రదోష సమయంలో శివస్మరణ, శివదర్శనం విధిగా చేయాలి. శివరాత్రి నాడు 'లింగోద్భవకాలం' విశేషమైనది. ఇది రాత్రి 11. 30 నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు ఉంటుందట.

శివరాత్రి పండుగ రోజున ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత శివాలయానికి వెళ్లి, షోడశోపచారాలతో శివుని మహాన్యాస పూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం చేసి, ఆ తరువాత సంగీత నృత్య వాద్యాలతో శివుని సేవించాలి. శివరాత్రి సమయంలో జాగారం, ఉపవాసానికి అత్యంత ప్రాముఖ్యం ఉంది. రాత్రి అంతా జాగరణ చేసిన తరువాత ఉదయాన్నే శివుని అభిషేకం చేసి, మరల యధావిధిగా పూజలు చేయాలి. అందరికి భోజనాలను పెట్టిన తరువాత పూజ చేసిన వ్యక్తి భోజనం చేయాలి.

శివ శివేతి శివేతి శివేతివా,
భవ భవేతి భవేతి భవేతివా
హర హరేతి హరేతి హరేతివా,
భజ మనశ్శివమేయ నిరంతరం.

**మహాశివరాత్రి**

**14 ఫిబ్రవరి 2018 న.**

# జనార్ధన ఠాకూర్

## ఫిబ్రవరి 2018 లో మీ రాశి ఫలాలు



9963933371, 9490189713

ఫిబ్రవరి లో : రవి 13 వరకు మకరంలో తదుపరి కుంభంలో; బుధుడు 15 వరకు మకరంలో, తదుపరి కుంభంలో ; శుక్రుడు 7 వరకు మకరంలో తదుపరి కుంభంలో; కుజుడు మాసాంతం వరకు వృశ్చి కంలో; గురువు తులలో; శని ధనస్సులో; రాహువు కర్కాటకంలో; కేతువు మకరం లో సంచారం

**మేష రాశి:**

ఈమాసం లో ఈ రాశి వారికి అనుకూలంగా ఉంటుంది. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉండును. గతంలో ఋణాలు చేస్తే కొంతమేర తీర్చుదురు. ఇంట్లో పెద్దవారి ఆరోగ్యవిషయంలో శ్రద్ధ తీసుకోవలెను. ఈ మాసంలో కంటిజబ్బులు, జ్వరం మరియు ఉదర సంబంధిత వ్యాదులవలన నలత కలుగును. సకాలంలో వైద్యపరీక్షలు చేయించుకోవలెను. గృహ వాతావరణంలో వాద ప్రతివాదముల వలన అశాంతి నెలకొను అవకాశం కలదు. ఉద్యోగస్తులకు పదోన్నతి మరియు ఆదాయ వనరులు పెరుగు అవకాశం కలదు. వ్యాపారం చేయువారికి లాభాల కాలం. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత ద్వారా మంచి ర్యాంకులు సాధించగలరు.

8 నుండి 10 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట మంచిది.

వైదిక సూచన: 1) ఆరోగ్యప్రదాతయైన సూర్యనారాయణస్వామికి నిత్యం అర్ఘ్యం ఇచ్చుట

2) మేధా దక్షిణామూర్తి స్తోత్ర పఠనం వలన శుభఫలితాలు పొందుతారు.

**వృషభరాశి:**

ఈమాసం లో ఈ రాశివారికి ఆర్థిక పరిస్థితి ఆశాజనకముగా వున్నా అధిక ఖర్చులు మరియు నష్టాల వలన ఇబ్బంది కలుగును. విద్యుత్ పరికరాలతో ప్రమాదం జరుగు అవకాశం కలదు. జాగ్రత్త వహించవలెను. గృహ వాతావరణం అనుకూలంగా వుండును. వివాహ ప్రయత్నములో ఉన్నవారికి కొన్ని ఆటంకములు కలుగును. తీర్థయాత్ర చేయు అవకాశం కలదు. ఉద్యోగస్తులకు మరియు వ్యాపారస్తులకు అనుకూల సమయం. ఉన్నత చదువుల కొరకు ప్రయత్నం చేయువారికి మంచి సమయం. 10 నుండి 13 వ తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) అంగారక స్తోత్ర పఠనం మరియు 2) దుర్గా అమ్మవారి దర్శనం మంగళవారం నాడు చేసినచో అనుకూల ఫలితాలు పొందుతారు.

**మిథున రాశి:**

ఈమాసం లో ఈ రాశివారికి ఆర్థిక పరిస్థితి సామాన్యముగా ఉండును. జీవిత భాగస్వామి ఆరోగ్యవిషయంలో శ్రద్ధ వహించవలెను. వాదోపవాదాలకు దూరంగా ఉండవలెను. మీ మౌనం వలన సమస్యలు వాటంతట అవి పరిష్కారమవును. వృధా ప్రయాణము వలన అలసట. ఉద్యోగస్తులకు మరియు వ్యాపారస్తులకు అనుకూలసమయం. స్థిరాస్తి విషయంలో అనుకూలత లభించును. పరిశోధన రంగంలో ఉన్నవారికి అత్యంత అనుకూలసమయం. 13 నుండి 15 వ తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) విష్ణుసహస్రనామ పారాయణ మరియు 2) గణపతి దేవాలయ సందర్శన వలన శుభఫలితాలు పొందుతారు.

**కర్కాటక రాశి :**

ఈమాసం లో ఈ రాశి వారికి అధిక ఖర్చులవలన ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉండదు. జాగ్రత్త అవసరం. గృహములో పెద్దవారికి ఆరోగ్యస్థితి బాగుండదు. శ్రద్ధ అవసరం. గృహములో కలహములవలన అశాంతి. పెట్టుబడులు పెట్టుటవలన నష్టపోయే అవకాశం కలదు. గృహమార్పుకు అవకాశం కలదు. ఉద్యోగస్తులకు పై అధికారుల సహాయ సహకారాలు వుంటాయి. విద్యార్థులకు అనుకూల సమయం. 15 నుండి 18 వ తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) మహామృత్యుంజయ మంత్రం నిత్యం మననం చేయుట మరియు 2) జ్యోతిర్లింగ దర్శనం చేయుట ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

**సింహ రాశి:**

ఈమాసం లో ఈ రాశివారికి చక్కటి ఆర్థిక ప్రణాళిక లేనిచో ఆర్థిక ఇక్కట్లు తప్పవు. ఆహార నియమాలు పాటించవలెను. గృహంలో ఒక వ్యక్తి యొక్క ఆరోగ్య పరిస్థితి కలవరపరచును. లీగల్ విషయాలలో జాగ్రత్తగా ఉండవలెను. ఉద్యోగస్తులకు అనుకూలసమయం కాదు. సాటి ఉద్యోగస్తులతో కలహము రావచ్చును.వ్యాపారస్తులు దూర ప్రయాణాలు చేయు అవకాశం కలదు. కొత్త వ్యాపారం కాని కొత్త పెట్టుబడులు పెట్టుటవలనగాని నష్టాలు చవిచూచెదరు. 18 నుండి 20 వ తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) కనకధారాస్తవం పారాయణ మరియు 2) తులసి అమ్మవారి వద్ద నిత్యం నేతిదీపం వెలిగించుట ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

**కన్యారాశి:**

ఈమాసం లో ఈ రాశి వారికి ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉండును. ఖర్చులు అదుపులో ఉండును. ఆహార విషయంలో జాగ్రత్తగా ఉండవలెను. బయట వ్యక్తులతో వాదోపవాదులు వుండు అవకాశం కలదు. కాని కుటుంబవ్యక్తుల సహకారం వలన సమస్య సమసిపోవును. కోర్ట్ వ్యవహారములు వాయిదా వేయుట మంచిది. ఉద్యోగస్తులకు మరియు వ్యాపారస్తులకు అనుకూల సమయం. 20 నుండి 22 వ తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) నిత్యం గణపతిస్తోత్ర పఠనం మరియు 2) శివాలయ దర్శనం వలన ఉత్తమ ఫలితాలు పొందుతారు.

**తులా రాశి:**

ఈమాసం లో ఈ రాశి వారికి ఆర్థిక విషయాలలో అనుకూలత లభించును. దీర్ఘకాల వ్యాధులతో బాధపడువారికి కొంత ఉపశమనం లభించును. దారి ప్రమాదములు జరుగు అవకాశం కలదు. కావున తగిన జాగ్రత్తలు తీసుకోవలెను. కొంత మానసిక అశాంతికి గురి అవుదురు. అవివాహితులకు వివాహ సమయం. ఉద్యోగస్తులకు స్థల మార్పు ఉండవచ్చును. వ్యాపారస్తులకు సామాన్యముగా ఉండును. 22 నుండి 24 వ తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) ఆదిత్య హృదయ పారాయణ మరియు 2) సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం నాడు పాలతో అభిషేకం చేయుట ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

**వృశ్చిక రాశి :**

ఈమాసం లో ఈ రాశి వారికి ఆర్థిక విషయాలలో అనుకూలత మరియు అదనపు ఆదాయం లభించు అవకాశం కలదు. ఆరోగ్యభంగము జరిగినా త్వరగా కోలుకొందురు. గృహ సౌకర్యం అనుకూలంగా ఉండును. ఉద్యోగస్తులు అదనపు బాధ్యతలు పొందుదురు. ఉన్నత అధికారుల మన్ననలు పొందెదరు. భాగస్వామ్య వ్యాపారస్తులకు అనుకూల సమయం కాదు. విద్యార్థులకు తమ గురువుల సహకారం లభించును. 24 నుండి 26 వ

తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) నిత్యం గణపతి అష్టోత్తర పారాయణ మరియు
2) ప్రతి సోమవారమూ శివాలయ సందర్శన చేయుట ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

**ధను రాశి :**

ఈమాసం లో ఈ రాశివారికి పితృ మూలక ఆస్తిద్వారా ఆర్ధిక పరిస్థితి ఆశాజనకముగా వున్నా అధిక ఖర్చులు ఉండును. వాతావరణ మార్పుల ద్వారా వచ్చు వ్యాధులకు గురికావచ్చును. బయట వ్యక్తుల ద్వారా గౌరవ మర్యాదలు పొందెదరు. ఆధ్యాత్మిక చింతన అధికం అగును. వృధా ప్రయాణాల వలన అలసట. ఉద్యోగస్తులకు తమ సహచరులతో భేదాభిప్రాయాలు కలుగవచ్చును. న్యాయపరమైన మరియు వ్యాపార విషయాలలో అనుకూలత కలదు. విద్యార్ధులకు అత్యంత అనుకూల సమయం. 1 వ తేదీ మరియు 26 నుండి 28 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన: 1) హనుమాన్ చాలీసా పారాయణం మరియు 2) శుక్రవారం నాడు మహాలక్ష్మి అమ్మవారి అష్టకం పారాయణ చేయుటచే శుభ ఫలితాలు.

**మకర రాశి:**

ఈమాసంలో ఈ రాశివారికి ఆర్ధిక చిక్కులు మరియు అధిక ఖర్చులు ఉండును. మీ ఆరోగ్యం మరియు కుటుంబ సభ్యుల ఆరోగ్యం వలన కలత చెందెదరు. ఉద్యోగస్తులకు శ్రమకు తగ్గ ఫలితం లభించదు. వ్యాపారస్తులకు వాణిజ్యపరమైన చిక్కులు ఉండవచ్చు. 28 వ తేదీన మరియు 1 నుండి 3 వ తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదావేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) శుక్రవారంనాడు మహాలక్ష్మి అమ్మవారిని ఆరాధించుట మరియు
2) శివ పంచాక్షరీ జప మంత్ర జపం చేయుట ద్వారా సమస్యల నుండి బయట పడుదురు.

**కుంభ రాశి:**

ఈమాసం లో ఈ రాశి వారికి ఆదాయ వనరులు తగ్గి ఖర్చులు పెరుగును. ఆర్ధిక చికాకులు వుండు అవకాశం కలదు. గృహ వాతావరణం బాగున్నా బంధువులతో విరోధము వచ్చు అవకాశం కలదు. ఈ తరుణంలో మౌనం మరియు ధ్యానం మీకు ఉపకరించును. ముఖ్యమైన విషయాలపై చర్చించి మరీ నిర్ణయం తీసుకోవలెను. ఉద్యోగస్తులకు మరియు వ్యాపారస్తులకు గడ్డుకాలం. 3 వ తేదీ నుండి 5 వ తేదీ వరకు ముఖ్యమైన పనులను వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) శని త్రయోదశి నాడు శివాభిషేకం మరియు
2) మంగళవారం నాడు హనుమాన్ ఆలయ సందర్శనం చేయుట ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.


**మీన రాశి :**

ఈమాసం లో ఈ రాశివారికి ఆర్ధిక పరిస్థితి అనుకూలముగా వున్నా, ఆర్ధిక చిక్కులనుండి బయటపడలేరు. స్పెక్యులేషన్ లో నష్టం వచ్చు అవకాశం కలదు. గృహ వాతావరణం వలన కోపతాపాలకు గురి అగుదురు. వృధా ప్రయాణాలు మరియు చిన్న చిన్న అనారోగ్య సమస్యల వలన ఇబ్బంది పడుదురు. చెడు స్నేహితులవలన చెడ్డ పేరు వచ్చును. ఉద్యోగస్తులకు అనుకూల సమయం. వ్యాపారస్తులకు సామాన్య కాలం. విద్యార్ధులు చదివిన చదువులు రివిజన్ చేసినచో మంచి ఫలితాలు పొందుతారు.
5 నుండి 8 వ తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన: 1) నిత్యం విష్ణు సహస్ర నామ పారాయణ మరియు 2) రాహుకాలంలో దుర్గా అమ్మవారికి నిమ్మ డిప్పలో దీపం వెలిగించుట ద్వారా ఉత్తమ ఫలితాలు పొందుతారు.

**సర్వే జనాస్సుఖినో భవంతు**

Published by T.Shanti, Edited and Printed by T.Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500048. Phone: 9490571297 / 94401 47993 ; email: teega51@gmail.com (www.chaitanyam.net)
Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad - 500001

# శ్రద్ధాంజలి



గత 5 సంవత్సరాలుగా మన పత్రికలో
వివిధ అంశాలపై చక్కని వ్యాసాలందిస్తూ
పాఠక హృదయాలను దోచుకున్న
శ్రీ వి వి ఎస్ శర్మ గారు 13-1-2018 న
భగవంతుడిలో ఐక్యమయ్యాయారు. ఆయన
ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.....

RNI No. APTEL/2011/39497 FEBRUARY 2018 Postal No. HSE/1043/2017-19
Date of Publishing: 1st February Date of Posting: 8th February



